'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

www.rajyasamskarana.com

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 18 | మంగళవారం | 1.9.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 18 | Tuesday | 1.9.2026 | Pages: 8 | Rate: 2


3లో..

## సింధు జల ఒప్పందంపై తేల్చిచెప్పిన భారత్

హేగ్ తీర్పు తిరస్కరణ


3లో..

## అమెరికా-కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

కెనడా దారుణమైన దుర్వినియోగదారు

ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు


3లో..

## యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

బీజేపీ కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం

మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్

హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

# రాష్ట్రం నెత్తిన అప్పుల కుప్పలు

## కేసీఆర్ నిర్వాకంవల్లే తప్పని తిప్పలు





- పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ?
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- అంబర్‌పేటలో పదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్లు
- సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

ముసారాంబాగ్ వద్ద కొత్త వంతెనను ప్రారంభించిన సందర్భంగా అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గత 60 ఏళ్లలో 16 మంది ముఖ్యమంత్రులు చేసిన అప్పులు కేవలం రూ. 70 వేల కోట్లు మాత్రమేనని, కానీ కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో ఆ అప్పును రూ. 8.11 లక్షల కోట్లకు పెంచారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఈ అప్పులకు వడ్డీలు, అసలు చెల్లించేందుకే ఏడాదికి రూ. 90 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. డిసెంబర్ 7న తాము అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాలా తీసిందని, గత ప్రభుత్వం మోపిన భారీ ఆర్థిక భారాన్ని మోస్తూనే రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్నామని తెలిపారు.

### కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలి

- వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.1.24 కోట్ల జీతభత్యాలు
- ఆందోళనలకు పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి

''కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి.


5లో..

# బ్యాకౌట్ అవుతున్న బ్యాక్ వర్డ్ క్లాస్

»యోగి పీఠానికి కదులుతున్న బేస్
»యూపీలో మొదలైన వ్యతిరేక సెగ
»ఆదమరిస్తే సెంట్రల్లో కమలం భగభగ

యూపీ రాజకీయాల్లో అసలు పోరు ఇప్పుడు ఓబీసీ ఓటు చుట్టూ కేంద్రీకృతమవుతోంది. రాష్ట్రంలో ఓబీసీలు సుమారు 40 శాతం ఉన్నారని అంచనాలు చెబుతున్నాయి. గత దశాబ్దంలో బీజేపీ బలమైన సామాజిక కూటమిని నిర్మించడంలో యాదవేతర ఓబీసీల మద్దతు కీలకంగా నిలిచింది. 2014, 2019 లోక్‌సభ ఎన్నికలు, 2017 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సమీకరణ బీజేపీకి భారీ విజయాలు అందించింది. 2022లోనూ బీజేపీ అధికారాన్ని నిలబెట్టుకుంది. కానీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో పరిస్థితిలో మార్పు కనిపించింది. సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కూటమి యూపీలో 43 లోక్‌సభ స్థానాలు గెలుచుకోగా, బీజేపీకి గణనీయమైన ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యంగా యాదవేతర ఓబీసీ వర్గాల్లో బీజేపీ మద్దతు తగ్గినట్టు ఎన్నికల అనంతర అంచనాలు సూచించాయి. కుర్మీ, కోయిరీ, కుష్వాహా వంటి వర్గాలపై ఇప్పుడు ప్రధాన రాజకీయ పార్టీల దృష్టి పడింది. మరోవైపు రాహుల్ గాంధీ కులగణన, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం, రిజర్వేషన్ల అంశాలను ముందుకు తెస్తున్నారు. అఖిలేష్ యాదవ్ పిడిఏ ఫార్ములాతో వెనుకబడిన వర్గాలు, దళితులు, అల్పసంఖ్యాకులను సమీకరించే ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ కూడా కుర్మీ నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, యాదవేతర ఓబీసీలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించే వ్యూహంపై దృష్టి పెట్టింది. ఉద్యోగాలు, పేపర్ లీక్‌ల అంశాలపై యువతలో అసంతృప్తి కూడా రాజకీయ చర్చలోకి వచ్చింది. 2024లో కనిపించిన ఓటు మార్పు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎంతవరకు కొనసాగుతుందన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న.

## ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్



- గ్లోబల్ సమ్మిట్ కు పకడ్బందీగా ఏర్పాట్లు
- ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. (వివరాలు 2లో..)

## శకుని మించినోడు వేముల ప్రశాంత్ రెడ్డి



- జీవితంలో ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- హస్తం అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం
- నాలుగు నెలలు ఈడీ, సీబీఐ కేసులతో జైలులో పెట్టారు
- నిప్పులా తిరిగి వచ్చానని భావోద్వేగం
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు

3లో..


6లో..

# స్మార్ట్ మొబైల్.. గుండె గుభేల్

»బడ్జెట్ ఫోన్.. గోల్డెన్ ఛాన్స్ గాన్
»ఫోన్ కొనాలా.. వెయిట్ చేయాలా?
»కంపెనీల లాభాల వేట.. సర్కార్ ట్యాక్స్ ఆట
»ఆండ్రాయిడ్ జీబీలతో కొత్త ఫిట్టింగ్
»అదనపు ధరలతో జేబులు కట్టింగ్
»స్మార్ట్ మొబైల్.. గుండె గుభేల్

ఒకప్పుడు రూ.10-15 వేలకే మంచి స్మార్ట్‌ఫోన్ వచ్చేది. ఇప్పుడు అదే స్థాయి ఫోన్ కోసం రూ.20-25 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. మెమరీ చిప్‌ల ధరలు పెరగడం, AI డేటా సెంటర్లకు భారీగా చిప్‌ల డిమాండ్ రావడం, దిగుమతి ఖర్చులు పెరగడం వంటి కారణాలతో బడ్జెట్ ఫోన్ల ధరలు పైకి వెళ్తున్నాయి. కొన్ని మోడళ్ల ధరలు రూ.1,000 నుంచి రూ.3,500 వరకు పెరిగాయి. దీంతో సామాన్యుడి బడ్జెట్ కుదేలవుతోంది. 8GB RAM, 256GB స్టోరేజ్ ఉన్న ఫోన్ కావాలంటే రూ.25 వేల లోపు మంచి ఎంపిక దొరకడం కష్టంగా మారుతోంది. ఫోన్ ఇప్పుడు విలాస వస్తువు కాదు.. చదువు, ఉద్యోగం, బ్యాంకింగ్, డిజిటల్ చెల్లింపులు, ప్రభుత్వ సేవలకు నిత్యావసర సాధనంగా మారింది. అయినా ధరలు మాత్రం తగ్గడం లేదు. కంపెనీలు లాభాలను కొంత తగ్గించుకోలేవా? ప్రభుత్వాలు బడ్జెట్ ఫోన్లపై పన్నుల భారాన్ని తగ్గించలేవా? ప్రపంచవ్యాప్తంగా టెక్నాలజీ చౌకగా అందుబాటులోకి వస్తున్న సమయంలో సామాన్యుడి ఫోన్ మాత్రం ఎందుకు ఖరీదవుతోంది? ఈ ప్రశ్న ఇప్పుడు ప్రతి కొనుగోలుదారుడిని వేధిస్తోంది. కొత్త ఫోన్ కొనాలా.. ఉన్నదానికే రిపేర్ చేయించుకుని కొనసాగాలా.. అన్న సందిగ్ధంలో మధ్యతరగతి కుటుంబాలు ఉన్నాయి.

# ధరణి కన్నా దరిద్రం భూభారతి

- 22ఏతో ప్రజలను కాల్చుకు తింటున్నారు
- ఇబ్బంది పడుతున్న దాదాపు 50 లక్షల మంది
- తక్షణమే రద్దు చేయాలి
- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి విధానం మరింత ఘోరంగా తయారైందని వారు మండిపడ్డారు. (వివరాలు 2లో..)



## భూభారతితో భూసమస్యలకు చెక్

- సర్వే చేసి రైతులకు భూ ఆధార్‌తో పాస్‌బుక్కులు
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తెలంగాణలో రైతులు, భూ యజమానులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురంలో దాదాపు 60 ఏళ్లుగా నలుగుతున్న అసైన్డ్ భూముల సమస్యను 'భూభారతి' రీసర్వే ద్వారా సమసిపోయేలా చేసి, 780 మంది రైతులకు 1,378 ఎకరాలకు సంబంధించిన భూఆధార్, క్యూఆర్ కోడ్, మ్యాప్‌లతో కూడిన పట్టాదార్ పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. (వివరాలు 2లో..)

## ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్

- వసతి గృహాలకు మంత్రి పొన్నం శంకుస్థాపన

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దన్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హుస్నాబాద్ సమీపం ఉమాపూర్‌లోని శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు సంబంధించి సుమారు రూ. 15 కోట్లతో నిర్మించనున్న వసతి గృహ భవనాలకు సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. (వివరాలు 2లో..)



## కృష్ణా జలాలు తరలిస్తుంటే చోద్యం

ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

కృష్ణా జలాలలను ఎపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆరఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. (2లో..)




2లో..

## తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు

మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.




## రోడ్డు నిర్మాణం కోసం సునీత పాదయాత్ర

ప్రభుత్వం రోడ్లను విస్మరించిందని విమర్శ

మెదక్ జిల్లా వెల్దుర్తి నుంచి పిల్లికొట్టాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. (వివరాలు 2లో..)



## పెట్టుబడులకు ఆహ్వానం

- శ్రీధర్ బాబుతో జర్మన్ ప్రతినిధి బృందం భేటీ

తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో జర్మన్‌కు చెందిన జీఐబీఏ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రి చర్చించారు. సెమీ కండక్టర్ రంగంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. (వివరాలు 2లో..)



## ప్రతిష్టాత్మకంగా ఇన్వెస్ట్
# తెలంగాణ గ్లోబల్ సమ్మిట్

- గ్లోబల్ సమ్మిట్ కు పకడ్బందీగా ఏర్పాట్లు.
- ప్రజాభవన్‌లో ప్రత్యేక వార్‌రూమ్ ప్రారంభించండి
- సీనియర్ అధికారులతో వివిధ కమిటీల ఏర్పాటు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు

సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు హాజరయ్యారు. సమ్మిట్‌కు సంబంధించిన ప్రతి అంశాన్ని ఎప్పటికప్పుడు సమీక్షించి, అవసరమైన నిర్ణయాలు వేగంగా తీసుకునేలా ప్రజాభవన్‌లో ప్రత్యేకంగా వార్‌రూమ్ ఏర్పాటు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. సమ్మిట్‌కు విస్తృత అంతర్జాతీయ, జాతీయ ప్రచారం కల్పించడంలో భాగంగా అక్టోబర్ మొదటి లేదా రెండో వారంలో దేశ రాజధాని ఢిల్లీలో కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. వి తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, వివిధ రంగాల్లో అభివృద్ధి అవకాశాలను ప్రచారంలో ప్రధానంగా ప్రదర్శించాలని తెలిపారు. సమ్మిట్ ఏర్పాట్లకు సంబంధించి అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ రోజువారీ పురోగతి నివేదికను రూపొందించి తనకు అందజేయాలని ఎ`లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రతి కమిటీకి అప్పగించిన బాధ్యతలు, వాటి అమలు తీరు, పెండింగ్ అంశాలు, తీసుకోవాల్సిన తదుపరి చర్యలను నివేదికలో పొందుపరచాలని సూచించారు. తెలంగాణను పెట్టుబడులకు అత్యుత్తమ గమ్యస్థానంగా ప్రపంచానికి పరిచయం చేసేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను నిర్వహించాలని, ఇందుకోసం ప్రభుత్వంలోని అన్ని శాఖలు ఒకే లక్ష్యంతో సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎనర్జీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎ`లానింగ్ సెక్రటరీ గౌరవ్ ఉప్పల్, ఫ్యూచర్ సిటి సిఎండి శశాంక, ట్రాన్స్కో సీఎం డి కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్ తదితరులు ఉన్నారు.

# రాష్ట్రం నెత్తిన అప్పుల కుప్పలు
## కేసీఆర్ నిర్వాకంవల్లే తప్పని తిప్పలు

- పదేళ్లలో అప్పులే తప్ప అభివృద్ధి ఏదీ?
- 8.11 లక్షల కోట్లకు 90వేల కోట్లు వడ్డీల చెల్లింపు
- మూసారాం బాగ్ బ్రిడ్జిని కూడా నిర్మించలేదు
- తాము అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు
- సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి

**అప్పుల ఊబిలో తెలంగాణ – ఆర్థిక పరిస్థితిపై ధ్వజం**

గత 60 ఏళ్లలో 16 మంది ముఖ్యమంత్రులు చేసిన అప్పులు కేవలం రూ. 70 వేల కోట్లు మాత్రమేనని, కానీ కేసీఆర్ ఒక్కరే తొమ్మిదేళ్ల పాలనలో ఆ అప్పును రూ. 8.11 లక్షల కోట్లకు పెంచారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం ఈ అప్పులకు వడ్డీలు, అసలు చెల్లించేందుకే ఏడాదికి రూ. 90 వేల కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోందన్నారు. డిసెంబర్ 7న తాము అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా దివాలా తీసిందని, గత ప్రభుత్వం మోపిన భారీ ఆర్థిక భారాన్ని మోస్తూనే రాష్ట్రాన్ని ముందంజలో నిలుపుతున్నామని తెలిపారు.

**మూసారాంబాగ్ బ్రిడ్జి ప్రారంభం – అంబర్‌పేట సమగ్ర అభివృద్ధి**

వర్షం వస్తే మునిగిపోయే మూసారాంబాగ్ బ్రిడ్జిని పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు నిర్మించలేకపోయిందని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే కొత్త వంతెన నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని చెప్పారు. ఊరికి దూరంగా నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వల్ల స్థానిక పేదలకు ఉపయోగం లేదని భావించి, అంబర్‌పేటలోని 10 ఎకరాల విస్తీర్ణంలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనున్నట్లు ప్రకటించారు. అలాగే ఈ ప్రాంతంలో ప్రభుత్వ కార్యాలయాల భవనాలను కడతామని, ఆక్రమణదారుల నుంచి కాపాడిన బతుకమ్మ కుంటను పేదలకు అంకితం చేశామని స్పష్టం చేశారు.

**HYDRA చర్యలపై స్పష్టత – ఆక్రమణదారులపై కఠిన వైఖరి**

చెరువులు, కుంటల్లో ఆక్రమణలను తొలగించడమే లక్ష్యంగా HYDRA పనిచేస్తోందని, తాము చెరువులను ఆక్రమించి ఫామ్‌హౌస్‌లు, విల్లాలు కట్టడం లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బతుకమ్మ కుంటను మళ్లీ ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, అల్లరి మూకలు తమ ప్రభుత్వంపై బురద చల్లేందుకు కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రాన్ని మూడు విభాగాలుగా విభజించి ప్రణాళికాబద్ధంగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.

**ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం**

2024 జనవరి 1 నుంచి ప్రతి నెలా 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని రేవంత్ రెడ్డి వెల్లడించారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి 5వ తేదీకల్లా వేతనాలు అందుతున్నాయని, రిటైర్మెంట్ బకాయిల కింద రూ. 6 వేల కోట్లను 100 రోజుల్లోనే చెల్లించామని వివరించారు. ఆగిపోయిన పీఆర్సీని అమలు చేయడంతో పాటు కార్పొరేట్ వైద్యం కోసం ఆరోగ్య భద్రత కార్డులను పునరుద్ధరించామని చెప్పారు. ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆర్టీసీకి నష్టం రాకుండా 32 నెలల్లో రూ. 11 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించామని, గత పాలనకు ఇప్పటి పాలనకు తేడాను ఉద్యోగులు గమనించాలని కోరారు.



## కేసీఆర్ పదవికి రాజీనామా చేయాలి

- వెయ్యి రోజుల్లో కేసీఆర్‌కు రూ.1.24 కోట్ల జీతభత్యాలు
- ఆందోళనలకు పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి

''కేసీఆర్ 1000 రోజుల్లో కోటి 24 లక్షల 40 వేల రూపాయలు జీతం తీసుకున్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి 365 రోజులు ఉద్యోగానికి హాజరు కాకపోతే డిస్మిస్ చేస్తారు. మరి కేసీఆర్‌ను ఏం చేయాలి. ప్రతిపక్ష నాయకుడి హోదా ఉన్నందుకు ఆయనకు ఇన్నిరోజులు సెక్యూరిటీ, ఇల్లు, బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు తదితర వసతుల కోసం ప్రభుత్వం రూ.21 కోట్లు ఖర్చు చేసింది. కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలి. ఆయన రాజీనామా కోరుతూ ప్రజలు ఊరూరా ఆందోళనలు చేయాలి.'' అని సీఎం రేవంత్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. అంబర్‌పేట సభలో సీఎం మాట్లాడుతూ కేసీఆర్‌కు.. నాకు పోలిక ఏంటి..? కేసీఆర్ సీఎం అయితే ఆయన కుటుంబ సభ్యులు, బంధువులకు పదవులు కట్టబెట్టారు. నేను సీఎం అయ్యాక ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పదవులు ఇచ్చాం. దేశంలోనే ప్రధాన ప్రతిపక్ష నేత వైఫల్యం చెందిన ఏకైక రాష్ట్రం తెలంగాణ. పదేళ్లలో మీరు ఏం చేశారో.. రెండున్నరేళ్లలో.. మేం ఏం చేశామో అసెంబ్లీలో చర్చకు సిద్ధం. ఈ వెయ్యి రోజుల్లో జనం కోసం కేసీఆర్ ఒక్కసారైనా బయటకు వచ్చారా? ఈ వెయ్యి రోజుల్లో ప్రధాన ప్రతిపక్ష నేత రూ.22.24 కోట్ల ప్రభుత్వ వేతనం తీసుకున్నారు. రేపటి నుంచి 6 రోజులపాటు ప్రధాన ప్రతిపక్ష నేత రాజీనామా చేయాలంటూ ఆందోళనలు చేయాలి.' అని ప్రతిపక్ష నేతపై సీఎం రేవంత్ ఘాటైన విమర్శలు చేశారు. ఉస్మానియా ఆసుపత్రిని 2 వేల పడకలతో కడుతున్నాం. వచ్చే ఏడాదిలో ప్రారంభిస్తాం. సనత్‌నగర్ టిమ్స్‌కు మర్రిచెన్నారెడ్డి పేరు, అల్వాల్‌లో ఉన్న టిమ్స్‌కు టి.అంజయ్య పేరు, ఎల్బీనగర్ టిమ్స్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు, వరంగల్‌లో ఉన్న టిమ్స్‌కు ప్రొ.జయశంకర్ పేరు పెడతాం.

# కృష్ణా జలాలు తరలిస్తుంటే చోద్యం
## ప్రభుత్వం తీరుపై మండిపడ్డ హరీష్ రావు

కృష్ణా జలాలలను ఎపి తరలించుకు పోతున్నా ఇంకెప్పుడు మేల్కొంటారని మాజీ మంత్రి, బీఆరఎస్ నేత హరీశ్ రావు మండిపడ్డారు. నీటి కేటాయింపులు లేకున్నా.. వరద జలాలు రాకున్నా.. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం బేసిన్ దాటి కృష్ణా జలాలను యథేచ్ఛగా తరలిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తుండటం తెలంగాణకు తీరని ద్రోహమని హరీశ్ రావు మండిపడ్డారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు.



ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో సాగునీటి కష్టాలు తీవ్రమవుతుంటే.. మరోవైపు ఏపీ ప్రభుత్వం తెలంగాణ నీటి హక్కులపై దండెత్తి కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలిస్తోంది. కృష్ణా బేసిన్‌లో భాగమైన భీమా, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులకు నీళ్లు లేక ఆయకట్టలు ఎండిపోతుంటే.. మరోవైపు బేసిన్‌తో సంబంధం లేని ప్రాంతాలకు ఏపీ నిబంధనలు ఉల్లంఘిస్తూ, యథేచ్ఛగా నీటిని తరలిస్తోంది. మాల్యాల, ముచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు, నాగార్జున సాగర్ కుడి కాల్వ.. ఇప్పుడు వెలిగొండ.. తెలంగాణ వాటా నీటిని ఏపీ తరలిస్తున్నా రేవంత్ ప్రభుత్వం ఎందుకు నోరు మెదపడం లేదు? రంగారెడ్డి, పాలమూరు, నల్లగొండ సహా తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తీరని ద్రోహం ఇది. తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా నీళ్లను మన పొలాలకు మళ్లించాల్సిన సీఎం రేవంత్.. ఏపీకి పరోక్షంగా ఎందుకు సహకరిస్తున్నారు? ప్రాజెక్టుల నిర్వహణ, నీటి వినియోగాన్ని పర్యవేక్షించాల్సిన కేఆరఎంబీ సైతం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం. తెలంగాణ ప్రయోజనాలను కాపాడాల్సిన సంస్థే ప్రేక్షకపాత్ర పోషిస్తే.. రాష్ట్ర నీటి హక్కులను ఎవరు కాపాడాలి? కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెంటనే స్పందించాలి. కేఆర్ఎంబీపై ఒత్తిడి తెచ్చి, తెలంగాణలోని కృష్ణా బేసిన్ ప్రాజెక్టులను నింపి, ఆయకట్టుకు నీటి సరఫరా జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం' అని హరీశ్ రావు అన్నారు.

# ధరణి కన్నా దరిద్రం భూభారతి

- తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- సిద్దిపేట ఆర్డీవో కార్యాలయం వద్ద బిజెపి ధర్నా



సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయం వద్ద బీజేపీ చేపట్టిన మహాధర్నాలో తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, మెదక్ ఎంపీ రఘునందన్ రావు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తీసుకొచ్చిన ధరణి పోర్టల్ కంటే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి విధానం మరింత ఘోరంగా తయారైందని వారు మండిపడ్డారు.

**రాష్ట్రంలో 22A (నిషేధిత భూముల జాబితా)**

నిబంధన వల్ల దాదాపు 50 లక్షల మంది ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తప్పులు జరిగాయని ఒప్పుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.. వాటిని సరిదిద్దడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేవలం రెండు ప్లాట్ల సమస్య ఉన్న సర్వే నెంబర్ 03 లో వేలాది ప్లాట్లను నిషేధిత జాబితాలో చేర్చారని, మరి అదే సర్వే నెంబర్‌లో ఉన్న సీఎం ఇల్లు 22A నుంచి ఎలా బయటకు వచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల భూములను లాక్కుని ప్రభుత్వం విక్రయిస్తోందని, 22A పై తక్షణమే శ్వేతపత్రం విడుదల చేసి, స్వతంత్ర సంస్థతో విచారణ జరిపించాలని ఆయన సవాల్ విసిరారు.

ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో పేదలు, రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయిందని విమర్శించారు. సీఎం, రెవెన్యూ మంత్రుల భూములు నిషేధిత జాబితా నుంచి ఎలా తొలగించబడ్డాయో దరఖాస్తులను బహిర్గతం చేయాలని నిలదీశారు. ప్రభుత్వం భూములు విక్రయించి వచ్చే సొమ్మును ఢిల్లీకి మూటగడుతోందని ఆరోపించారు. భూ సమస్యలతో ఇబ్బంది పడుతున్న రైతుల కోసం బీజేపీ పోరాడుతుందని, అవసరమైతే జైలుకైనా వెళ్తామని నాయకులు స్పష్టం చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల లోపు లేదా సెప్టెంబర్ 7వ తేదీ లోగా 22A జీవోను తక్షణమే రద్దు చేయాలని, లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.

# రోడ్డు నిర్మాణం కోసం సునీత పాదయాత్ర
## ప్రభుత్వం రోడ్లను విస్మరించిందని విమర్శ




మెదక్ జిల్లా వెల్దుర్తి నుంచి పిల్లికొట్టాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభమైంది. సోమవారం ఉదయం నర్సాపూర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వెల్దుర్తి నుంచి పాదయాత్రగా కలెక్టరేట్‌కు బయల్దేరారు. అక్కడ జిల్లా కలెక్టర్‌కు ఆమె వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెల్దుర్తి పిల్లికొట్టాల రహదారి నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్డు నిర్మాణాన్ని చేపట్టకుండా ఆ నిధులను రద్దు చేసిందని విమర్శించారు.

ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే డబుల్ రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రహదారి నిర్మాణం కోసం ప్రజల తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేందుకు పాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ రోడ్లను పూర్తిగా విస్మరించిందని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. వాటిని బీటీ రోడ్లుగా నిర్మాణం చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు . పాదయాత్రకు మద్దతుగా మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాడు బీఆరఎస్ ప్రభుత్వం బీటీ రోడ్ల నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరు చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు రద్దు చేసిందని విమర్శించారు. ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం గెలిచాక ప్రజలను మోసం చేసిందనన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు బీఆరఎస్ పార్టీ ప్రజల తరఫున పోరాడుతుందన్నారు.

# తెలంగాణలో రైల్వేల అభివృద్ధికి చర్యలు
## మహబూబ్‌నగర్‌లో ఆధునీకరణ పనులు పరిశీలించిన కిషన్ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్‌ను రైల్వే హబ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. 5 వందేభారత్ రైళ్లను కేందప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని ప్రస్తావించారు. మోదీ హయాంలోని పదేళ్లలో 100 కొత్త రైళ్లను తెలంగాణలో అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. తెలంగాణలో 42 రైల్వే స్టేషన్లను ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నామని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతులకు పెద్దపీట వేస్తున్నామని చెప్పుకొచ్చారు. 2014కు ముందు రైల్వే స్టేషన్లు అధ్వానంగా ఉండేవని.. కానీ నేడు మోదీ హయాంలో పరిస్థితి మారిందని తెలిపారు. ప్రయాణికులు భాగస్వాములైతే స్వచ్ఛ స్టేషన్లు సాధ్యమవుతాయని వివరించారు. రైల్వే స్టేషన్లు ఏయిర్‌పోర్టు స్థాయిలో ఉండాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని ఉద్ఘాటించారు. 2014కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో రూ.886 కోట్ల రైల్వే బడ్జెట్ ఉంటే 2026`27 బడ్జెట్లో తెలంగాణకే రూ.5454 కోట్లను కేంద్రం కేటాయించిందని కిషన్‌రెడ్డి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి తెలంగాణలో రైల్వే రంగం నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. దేశంలో 7 బుల్లెట్ ట్రైన్స్ ప్రవేశపెడితే.. తెలంగాణకు మూడు ఇచ్చామని.. ఇది రైల్వే రంగంలో సువర్ణాధ్యాయమని నొక్కిచెప్పారు. రూ.5 లక్షల కోట్లతో బుల్లెట్ ట్రైన్స్ అందుబాటులోకి తీసుకువస్తున్నామని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరగకుండా దేశంలోనే తొలిసారిగా కవచ్ ప్రాజెక్టును తెలంగాణలో ప్రయోగాత్మకంగా అమలు చేయబోతున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



**భారత జీడీపీ వృద్ధిరేటు 7.8 శాతం నమోదు**

ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు, చమురు ధరల ఒడిదుడుకులు కొనసాగుతున్నప్పటికీ, 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో భారతదేశం 7.8 శాతం జీడీపీ వృద్ధిని సాధించి తన ఆర్థిక పటిష్టతను చాటుకుంది. గతేడాది ఇదే సమయంలో నమోదైన 6.9 శాతంతో పోలిస్తే ఇది గణనీయమైన పురోగతి. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి, నిర్ణయాత్మక నాయకత్వం మరియు కేంద్ర ప్రభుత్వ సమర్థవంతమైన విధానాలపై దేశ ప్రజలకు, వ్యాపారవేత్తలకు ఉన్న విశ్వాసానికి ఈ అసాధారణ విజయం నిదర్శనమని స్పష్టమవుతోంది.

**అన్ని రంగాల్లో విస్తృత పురోగతి**

దేశ ఆర్థిక వ్యవస్థలోని ప్రధాన రంగాలు అద్భుతమైన ప్రదర్శన కనబరిచాయి. ప్రైమరీ సెక్టార్‌లోని వ్యవసాయ, అనుబంధ రంగాలు 3.6 శాతం వృద్ధిని నమోదు చేయగా, తయారీ, నిర్మాణ రంగాలు కలిగిన సెకండరీ సెక్టార్ 8.6 శాతం వృద్ధిని సాధించింది. తృతీయ రంగామైన సేవా రంగం ఏకంగా 10 శాతం వృద్ధి నమోదు చేయడం విశేషం. ముఖ్యంగా ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ఐటీ, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగాలు 12.1 శాతం వృద్ధిని కనబరచి భారత సేవా రంగం ఎంత బలంగా ఉందో నిరూపించాయి. ఎల్‌నినో వంటి వాతావరణ సవాళ్లు ఉన్నప్పటికీ వ్యవసాయం స్థిరంగా సాగడం, రాబోయే త్రైమాసికాల్లో మరింత పుంజుకునే అవకాశం ఉండటం సానుకూల అంశం.

**'వికసిత్ భారత్' దిశగా అడుగులు**

ఈ విజయం కేవలం ఒక్క త్రైమాసికానికి పరిమితమైనది కాదని, 2047 నాటికి దేశాన్ని 'వికసిత్ భారత్'గా మార్చాలన్న ప్రధాని మోదీ సంకల్పానికి బలమైన ముందడుగు అని కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. భారత్ అత్యంత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతోందని, ఈ ఆర్థిక వృద్ధి జోరును ఆపడం ఎవరి వల్లా కాదని ఆయన తన ప్రకటనలో ధీమా వ్యక్తం చేశారు.

# భూభారతితో దశాబ్దాల భూసమస్యలకు చెక్

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

గతంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు 125 ఏళ్ల నాటి భూ సర్వేలనే కొనసాగించాయని, రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తెచ్చి విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిందని మంత్రి పేర్కొన్నారు. సంక్షేమం, ఇందిరమ్మ ఇళ్లే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలకు కూడా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వచ్చే ఎన్నికల్లో ఈ అభివృద్ధిని చూపించే ఓట్లు అడుగుతామని ధీమా వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ పాలనలో రెవెన్యూ వ్యవస్థను నిర్వీర్యం చేసి, ఇప్పుడు భూ సమస్యలపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల భూ సమస్యలను పట్టించుకోని ప్రతిపక్షాలకు ప్రజా ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని స్పష్టం చేశారు.

**అధికారుల నిర్లక్ష్యంపై హెచ్చరిక, క్షేత్రస్థాయి తనిఖీలకు ఆదేశం**

మహబూబాబాద్ కలెక్టరేట్ లో మంత్రి సీతక్కతో కలిసి నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారుల పనితీరుపై పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. 22A నిషేధిత జాబితా లేదా ఇతర భూ వ్యవహారాల్లో నిబంధనలకు విరుద్ధంగా సొంత నిర్ణయాలు తీసుకోవద్దని స్పష్టం చేశారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా నెలకు కనీసం 12 సార్లు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని, తహసీల్దార్లు సమీక్షలకు గైర్హాజరు కావడం సరికాదని ఆదేశించారు.



# సెమీ కండక్టర్ రంగంలో పెట్టుబడులకు ఆహ్వానం

**శ్రీధర్ బాబుతో జర్మన్ ప్రతినిధి బృందం భేటీ**

సెమీ కండక్టర్స్, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశాలు కల్పిస్తున్నామని మంత్రి చెప్పుకొచ్చారు. 'తెలంగాణజర్మనీ' లాజిస్టిక్ కారిడార్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. జర్మనీ, యూరప్ మార్కెట్లకు తెలంగాణ ఎగుమతులు సులభంగా చేరేలా ప్రత్యేక కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వేగవంతమైన అనుమతులు, మౌలిక వసతులు, పెట్టుబడి ప్రోత్సాహకాలు అందిస్తామని మంత్రి చెప్పారు. జర్మనీ టెక్నాలజీని తెలంగాణ టాలెంట్‌తో అనుసంధానిస్తామని వెల్లడించారు. 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026'పై జర్మనీ పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026 నిర్వహిస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా హుస్నాబాద్ అభివృద్ధి
## శాతవాహన వసతి గృహాలకు మంత్రి పొన్నం శంకుస్థాపన

మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త కోర్సులను తీసుకొస్తానన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. హుస్నాబాద్లో ఇంజినీరింగ్ కళాశాల మండలంలో ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవనం నిర్మాణం జరుగుతోందని తెలిపారు. చిగురుమామిడి మండలంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, సైదాపూర్ మండలంలో అదనంగా మరో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభించనున్నట్లు మంత్రి పొన్నం చెప్పారు. భీమదేవరపల్లి మండలంలో నవోదయ పాఠశాల ఎల్కతుర్తి మండలంలో ట్రిపుల్ ఐటీ బ్రాంచ్ రాబోతున్నాయన్నారు. హుస్నాబాద్‌లో కబడ్డీ అకాడమీ, మరో స్టేడియాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన విద్యార్థులు ఇక్కడే చదువుకోవాలని, రేపటి భవిష్యత్తులో మంచి ప్లేస్మెంట్స్ సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ సతీష్ కుమార్, ప్రిన్సిపల్ తిరుపతి రెడ్డి, పుర అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ నేతల దాడి హేయం

- బీజేపీ కార్యాలయం రక్షణపై పోలీసుల నిర్లక్ష్యం
- మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



హైదరాబాద్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద యూత్ కాంగ్రెస్ నేతలు వ్యవహరించిన తీరుపై కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ కార్యాలయం వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం చేసి, ఆ పార్టీ కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తోందా? అని నిలదీశారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే పోలీసులు తమాషా చూస్తున్నారా? అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు తొత్తులుగా పోలీసులు పనిచేస్తున్నారా? అని బండి సంజయ్ మండిపడ్డారు. భాగ్యనగరం నడిబొడ్డున ఉన్న జాతీయ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి రక్షణ కల్పించే బాధ్యత మీకు లేదా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. యూత్ కాంగ్రెస్ నేతలు అరాచకం సృష్టిస్తోంటే అక్కడ పోలీసులెందుకు లేరు? అని నిలదీశారు. పోలీసుల వైఫల్యానికి మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తమ సహనాన్ని చేతగానితనంగా భావిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. ఖబడ్దార్ కాంగ్రెస్ నేతల్లారా.... తాము తలుచుకుంటే బయట తిరగలేరని బండి సంజయ్ హెచ్చరించారు. ఈ ఘటనకు కారణమైన వారిని అరెస్ట్ చేసి చట్టం ముందు సాయంత్రంలోపు నిలబెట్టాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో యూత్ కాంగ్రెస్ నేతల చర్యకు మించి ప్రతి చర్యలు ఉంటాయని వార్నింగ్ ఇచ్చారు. బీజేవైఎం కార్యకర్తలు తలుచుకుంటే యూత్ కాంగ్రెస్ నేతలు బయట తిరగలేరని మందలించారు. ఈ ఘటనపై కాంగ్రెస్ నాయకత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. లేకపోతే కాంగ్రెస్ కార్యాలయాలను బీజేపీ శ్రేణులు దిగ్బంధిస్తారని హెచ్చరించారు. జరగబోయే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ నేతలు బీజేపీ ఆఫీస్‌పై చేసిన దాడిపై తెలంగాణ పోలీసు ఉన్నతాధికారులకు కేంద్రమంత్రి బండి సంజయ్ ఫోన్ చేసి ఆరా తీశారు. బీజేపీ ఆఫీస్ వద్ద ప్రధాని దిష్టిబొమ్మ దగ్ధం చేసి, కార్యాలయ గేటుకు నల్ల రంగు పూస్తుంటే పోలీసులు ఏం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. పట్టపగలు బీజేపీ ఆఫీస్‌పై దాడి చేస్తుంటే ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఏం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులను వివరణ కోరారు. తక్షణమే ఈ ఘటనకు బాధ్యులైన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

## సింధు జల ఒప్పందంపై భారత్ తేల్చేసింది

- హేగ్ తీర్పును తిరస్కరించిన భారత్



సింధు జల ఒప్పందంపై హేగ్‌లోని పర్మనెంట్ కోర్ట్ ఆఫ్ ఆర్బిట్రేషన్ ఇచ్చిన తీర్పును భారత్ తీవ్రంగా తిరస్కరించింది. ఈ వ్యవహారంపై నిర్ణయం తీసుకునే అధికారం ఆ సంస్థకు లేదని స్పష్టం చేసింది. సింధు జల ఒప్పందాన్ని పునరుద్ధరించాలని, ఒప్పందాన్ని కొనసాగించాలని కోర్టు చేసిన సూచనలను భారత్ అంగీకరించలేదు. 1960 సెప్టెంబర్‌లో భారత్‌పాకిస్థాన్ మధ్య కుదిరిన ఈ ఒప్పందం సింధు నదీ వ్యవస్థలోని జలాల పంపకాన్ని నియంత్రిస్తుంది. అయితే గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన తర్వాత భారత్ పాకిస్థాన్‌పై పలు కఠిన చర్యలు తీసుకుంది. అందులో భాగంగా సింధు జల ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అప్పటి నుంచి "రక్తం, నీరు కలిసి ప్రవహించలేవు" అన్న తన వైఖరిని భారత్ పదేపదే స్పష్టం చేస్తోంది.

### ఉగ్రవాదంపై చర్యలే షరతు

భారత విదేశాంగ శాఖ తాజాగా ఇచ్చిన ప్రకటనలో హేగ్ సంస్థను తీవ్రంగా తప్పుబట్టింది. ప్రపంచ బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ మధ్యవర్తిత్వ సంస్థ ఒప్పంద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైందని భారత్ ఆరోపించింది. గతంలోనూ ఈ సంస్థ చేసిన ప్రకటనలను భారత్ గుర్తించలేదని తెలిపింది. అంతేకాదు, ఈ సంస్థ ముందు భారత్ హాజరు కాలేదని, దాని గత నిర్ణయాలను కూడా పట్టించుకోలేదని స్పష్టం చేసింది. భారత్ తీసుకున్న సార్వభౌమ నిర్ణయాలపై తీర్పులు ఇచ్చే అధికారం ఈ సంస్థకు లేదని విదేశాంగ శాఖ తేల్చిచెప్పింది. పాకిస్థాన్ భూభాగం నుంచి కొనసాగుతున్న సరిహద్దు ఉగ్రవాద నెట్‌వర్క్‌లను పూర్తిగా నిర్మూలించేందుకు విశ్వసనీయమైన, తిరుగులేని చర్యలు తీసుకునే వరకు ఒప్పందం నిలిపివేత కొనసాగుతుందని భారత్ స్పష్టం చేసింది. ప్రస్తుత ప్రాజెక్టులు సహా సింధు జలాల విషయంలో భారత్ తీసుకునే చర్యలపై హేగ్ సంస్థ తాజా తీర్పు ఎలాంటి ప్రభావం చూపదని న్యూఢిల్లీ తేల్చిచెప్పింది.

## జాతీయ జెండాకు అవమానంపై మూల్యం తప్పదు

- ఖలిస్థానీ వేర్పాటువాదులకు కిరణ్ రిజిజు హెచ్చరిక



న్యూయార్క్‌లో భారత జాతీయ జెండాను అవమానించిన ఖలిస్థానీ వేర్పాటు వాదులకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఇలాంటి వారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఎక్స్ వేదికగా హెచ్చరించారు. న్యూయార్క్‌లో మ్యాడిసన్ స్క్వేర్ గార్డెన్ వేదికగా జరిగిన సభలో ఆరఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ హాజరైన సందర్భంగా స్టేడియం బయట జరిగిన ఈ ఘటన తాలూకు వీడియోను మంత్రి నెట్టింట షేర్ చేశారు. 'ఆరఎస్ఎస్‌ను లేదా బీజేపీని విమర్శించే హక్కు మీకు ఉందని మేము ఎప్పటి నుంచో చెబుతూనే ఉన్నాము. కానీ మా దేశాన్ని అవమానించవద్దు. మీరు ఓ విషయాన్ని జాగ్రత్తగా వినండి. మా దేశాన్ని, జెండాను అవమానిస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు' అని కేంద్ర మంత్రి తన పోస్టులో వార్నింగ్ ఇచ్చారు. వీడియోలో కనిపించిన దాని ప్రకారం, స్టేడియం బయట ఖలిస్థానీలు నానా రభసా సృష్టించారు. ఓ వ్యక్తి తన కాలికి భారత జాతీయ జెండాను చుట్టుకుని అటూ ఇటూ ఊపుతూ అవమానించాడు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని నెట్టింట పలువురు డిమాండ్ చేశారు. నిందితులను గుర్తించాలని యూఎస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరఎస్ఎస్ సంస్థ 100 ఏళ్లు పూర్తి చేసుకున్న తరుణంలో సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటైన ఈ సభలో ఆరఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రసంగించారు. అమెరికాలో ఉంటూ ఉపాధి పొందే వారు కర్మ భూమి పట్ల తమ బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. వివిధ దేశాల్లో హిందువులు బాధ్యతాయుత జీవనంతో ఆదర్శవంతంగా నిలవాలని అన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వరి సేవలు ప్రశంసనీయం

- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు

ఆంధ్రప్రదేశ్‌లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు అడిషనల్ డైరెక్టర్‌గా సుబ్రమణ్యేశ్వరి అందించిన సేవలు ప్రశంసనీయమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు కొనియాడారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, జపనీస్ ఎన్‌సెఫలైటిస్ (ఏఇ), మెలియోయిడోసిస్ వంటి వ్యాధుల నియంత్రణకు సుబ్రమణ్యేశ్వరి తీవ్రంగా కృషి చేశారని పేర్కొన్నారు. పదవీ విరమణ సందర్భంగా విజయవాడలోని ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయంలో సోమవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చక్రధర్ బాబు మాట్లాడుతూ..మహిళలు ఉద్యోగ రంగంలో రాణించేందుకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం, సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుబ్రమణ్యేశ్వరి కుటుంబ సభ్యులను కూడా అభినందించారు. ఉద్యోగపదవీ విరమణ ఉద్యోగ జీవితంలో సహజమైన ప్రక్రియ అన్నారు.వ్యాధుల నియంత్రణలో కంటైన్‌మెంట్, సర్వైలెన్స్, సమర్థవంతమైన చికిత్సా విధానాలు కీలకమని, ప్రజలు కూడా స్వీయ సంరక్షణతో పాటు రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో సహకరిస్తూచిన అందరికీ సుబ్రమణ్యేశ్వరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, ఇతర రాష్ట్ర హెల్త్ డిపార్ట్మెంట్ ఉన్నతస్థాయి అధికారులు విజయలక్ష్మి, డి.ప్రకాష్ రావు, బీవీ రావు, అర్జునరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# శకుని మించినోడు వేముల ప్రశాంత్ రెడ్డి

- జీవితంలో ఎవరిని క్షమించినా ప్రశాంత్‌ను క్షమించను
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాంగ్రెస్‌లో చేరే ప్రయత్నం
- ఈడీ, సీబీఐ కేసులతో జైలులో పెట్టారు
- నిప్పులా తిరిగి వచ్చానని భావోద్వేగం
- తెలంగాణ కోసం కష్టపడ్డ తననే గెంటేశారు
- నిజామాబాద్ పాంచజన్య సభలో కవిత విమర్శలు



తెలంగాణ కోసం కష్టపడ్డ తనను అన్యాయంగా బయటకు గెంటేశారని, ఎంతో కష్టపడి పార్టీ అధికారంలోకి వచ్చేలా చేసిన సొంత పార్టీలోనే నాకు స్థానం లేకుండా పోయిందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తాను ఏ తప్పూ చేయకున్నా తిహార్ జైలులో పెట్టారని అన్నారు. తండ్రిని బిడ్డను వేరుచేయడంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిదే మొదటి పాత్ర అని ఆమె దుయ్యబట్టారు. ఆయన శకుని పాత్ర పోషించినట్లు ఆరోపించారు. నిజామాబాద్‌లో నిర్వహించిన పాంచజన్య సభలో కవిత మాట్లాడుతూ కంటతడి పెట్టారు. హరీశ్‌రావునో, సంతోష్‌రావునో క్షమిస్తానేమో గానీ.. ప్రశాంత్‌రెడ్డిని మాత్రం క్షమించను. ఆయనకు నా ఉసురు తగులుతుంది. ప్రశాంత్‌రెడ్డిని కేసీఆర్ కుమారుడిలా చూసుకుంటే.. ఆయన మా మధ్య చిచ్చుపెట్టారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిన రెండో రోజే ఆయన కాంగ్రెస్ పార్టీతో మాట్లాడారు. ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. నెల రోజులు అమెరికాలో ఉండి వేం నరేందర్‌రెడ్డితో సంప్రదింపులు చేశారని ఆరోపించారు. ప్రశాంత్‌రెడ్డికి ప్రజా జీవితం లేదు. ఆయన బాల్కొండ నుంచి పారిపోవాలి. ప్రశాంత్‌రెడ్డి వైఖరి పులిని చూసి నక్క వాతపెట్టుకున్నట్లుగా ఉంది. ఆయన మంత్రి కావడానికి నేను ఎంతో ప్రయత్నం చేశా. ప్రశాంత్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి, ఆనాటి బోధన్ ఎమ్మెల్యేను గెలిపించడానికి ఎంతో కష్టపడ్డాను. అయితే వారందరూ నన్ను పరాజితురాలిని చేశారు. నేను ఏం తప్పు చేశానని తిహార్ జైలులో పెట్టారు? నిజామాబాద్ జిల్లా కోడలిగా ఉద్యమం చేసిన నన్ను నాలుగేళ్లు ఈడీ, సీబీఐ వేధింపులకు గురిచేశాయి. చివరకు నేను ఏ తప్పు చేయలేదని తేలింది. నన్ను ఎందుకోసం పార్టీ నుంచి బహిష్కరించారు? తెలంగాణ రక్షణ సేన.. పదవుల కోసం పెట్టిన పార్టీ కాదు.

కన్నీళ్లు పెట్టుకున్నానని నేను పిరికిదాన్ని అనుకోవద్దు అని కవిత చెప్పారు. ఈ గడ్డ బిడ్డగా ఇక్కడ మిమ్ములను చూడగానే భావోద్వేగంతో కన్నీళ్లు ఆగడం లేదన్నారు. కేసీఆర్ పెద్ద కొడుకుగా ప్రశాంత్ రెడ్డి చెప్పుకుంటారని.. కానీ, మహాభారతంలో శకుని వంటి వ్యక్తి ఆయనని మండిపడ్డారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి రావాల్సిందేనని అన్నారు. నిజామాబాద్ జిల్లాలో తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని ప్రజలను కోరారు. 'నిజామాబాద్ కోడలిగా ఇక్కడ పని చేశా. నాకు మళ్లీ ఒక అవకాశం ఇవ్వండి. మీరే నా ధైర్యం' అని కవిత అన్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే తాను ఎక్కడికైనా, ఏ పార్టీలోకైనా వెళ్లగలనని, కానీ ప్రజల కోసం పనిచేయాలనే ఉద్దేశంతోనే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు. ఈ సందర్భంగా తనపై నమోదైన కేసులను ప్రస్తావిస్తూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఎన్ని కేసులు పెట్టినా నేను తప్పు చేయలేదనే చెప్పా. నన్ను తీహార్ జైలులో ఎందుకు పెట్టారు?' అని కవిత ప్రశ్నించారు. తాను కష్టాల్లో ఉన్నప్పుడు కనికరం చూపకుండా పార్టీ నుంచి వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజాయితీగా ఉన్నాను కాబట్టే బాధతో కన్నీళ్లు వస్తున్నాయని అన్నారు. తనను పిరికిదాన్ని అనుకోవద్దని హెచ్చరించారు. జైలులో ఉన్న సమయంలో తన అత్తగారు అండగా నిలిచారని కవిత గుర్తు చేసుకున్నారు. మరోవైపు, కాళేశ్వరం ప్రాజెక్టుపైనా తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా నిజామాబాద్ జిల్లాలో ఒక్క ఎకరానికీ నీరు అందలేదని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, అప్పటి ఎమ్మెల్యేల ఆస్తులు పదేళ్లలో భారీగా పెరిగాయని విమర్శించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో చేసిందేమీ లేదని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన ప్రతిపక్షం నిద్రపోతోందని వ్యాఖ్యానించారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు స్థానాల్లో తెలంగాణ రక్షణ సేన విజయం సాధిస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. అధికారంలోకి వస్తే ఉచిత విద్య, ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. రాష్ట్రానికి రూ.2లక్షల కోట్ల ఆదాయం వస్తోందని, అందులో రూ.లక్ష కోట్లు కేటాయిస్తే ఉచిత విద్య, వైద్యం అమలు చేయవచ్చని అన్నారు. సామాజిక న్యాయం జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తమ కార్యకర్తలను బెదిరించే రోజులు పోయాయని కవిత చెప్పుకొచ్చారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని మాజీ మంత్రి కేటీఆర్ స్నేహితుడైన కోరుట్ల ఎమ్మెల్యే కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కవిత ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌పైనా విమర్శలు గుప్పించారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని ఇప్పటివరకు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. అర్వింద్ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమవుతున్నాయని అన్నారు. తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తికి ప్రజలు అవకాశం ఇవ్వాలని కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి చేశారు.

## విశాఖలో ఏఐజీ ఆస్పత్రి నిర్మాణం

- 2వేల కోట్ల పెట్టుబడితో 9వేల మందికి ఉపాధి
- శంకుస్థాపన చేసిన మంత్రి లోకేశ్
- ఆలిండియా రేడియో సెంటర్‌లో రోశయ్య విగ్రహావిష్కరణ



ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏఐజీ ఆసుపత్రి రాష్ట్ర ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ మేరకు విశాఖ 8వ వార్డులోని ఎండాడ వద్ద ఏఐజీ హాస్పిటల్స్ నిర్మాణానికి సంస్థ ఛైర్మన్ డాక్టర్ డి.నాగేశ్వర్ రెడ్డితో కలిసి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ భూమిపూజ చేశారు. ఎండాడ వద్ద వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేశ్‌కు ఏఐజీ హాస్పిటల్స్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనులకు మంత్రి శిలాఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఆసుపత్రికి సంబంధించి రూపొందించిన ఏవీని వీక్షించారు. విశాఖలో నెలకొల్పనున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ దశలవారీగా ఐదేళ్లలో రూ.2 వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 9వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. పూర్తిస్థాయి నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి సామర్థ్యం వెయ్యి పడకలకు చేరనుంది. విశాఖలో 9 ఎకరాల్లో ఆసుపత్రి క్యాంపస్, 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయనుంది. అంతకుముందు మాజీ సిఎం రోశయ్య విగ్రహాన్ని లోకేశ్ ఆవిష్కరించారు. దివంగత మాజీ గవర్నర్, మాజీ సీఎం కొణిజేటి రోశయ్య స్ఫూర్తితో యువత రాజకీయాల్లోకి రావాలని మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని ఆలిండియా రేడియో జంక్షన్‌లో రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి టీజీ భరత్, ఎంపీ భరత్, ఎమ్మెల్యేలు వంశీ, విష్ణు కుమార్ రాజు, రోశయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రోశయ్యను స్టాట్యూ ఆఫ్ స్టేట్స్ మాన్‌గా నామకరణం చేయాలని మంత్రి లోకేశ్ సూచించారు. తమలాంటి యువతకు రోశయ్య ఆదర్శమని పేర్కొన్నారు. రోశయ్య లాంటి రాజకీయాలకు తమ తరం దూరమైందని బాధపడుతున్నానని తెలిపారు. తమ తరం రాజకీయాల్లో మార్పు రావాలని చెప్పారు. ఆయన అన్ని పదవుల్లో పనిచేశారని.. తెలుగు జాతి కోసం ఆలోచించారని కొనియాడారు. రోశయ్య గురించి పుస్తకాలు రాయాలని, కుటుంబ సభ్యులతో కలిసి ఓ మ్యూజియం కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఆయన చివరి వరకు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. అలాంటి కమిట్‌మెంట్ యువతలో ఉండాలని, ప్రతి ఒక్కరిలో ఉండాలని మంత్రి లోకేశ్ సూచించారు.

## హెచ్-4 ఉద్యోగాలకు అమెరికా కోత

- భారతీయులపై పెను ప్రభావం
- హెచ్-1బీ కుటుంబాలకు కొత్త కష్టాలు




అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయ హెచ్ 1బీ వీసాదారుల కుటుంబాలకు ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన తాజా నిబంధన ఆందోళన కలిగిస్తోంది. హెచ్ 1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకు ఉద్యోగం చేసుకునే అవకాశం కల్పిస్తున్న హెచ్ 4 ఈఏడీ విధానాన్ని తొలగించే ప్రతిపాదనను అమెరికా డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ముందుకు తెచ్చింది. 2015లో అమల్లోకి వచ్చిన ఈ విధానం వల్ల అర్హత ఉన్న హెచ్ 4 వీసా జీవిత భాగస్వాములు ప్రత్యేక ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్ తీసుకుని అమెరికాలో చట్టబద్ధంగా పనిచేసే అవకాశం పొందుతున్నారు. ఇప్పుడు ఆ నిబంధనను వెనక్కి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే హెచ్ 4 వీసాపై ఆధారపడిన వేలాది మంది జీవిత భాగస్వాములు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడొచ్చు. ముఖ్యంగా భారతీయ కుటుంబాలపై ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. 2014 నుంచి 2017 మధ్య హెచ్ 4 ఈఏడీ దరఖాస్తుల ఆమోదాల్లో 93 శాతం భారతీయులకు దక్కగా, వారిలో 94 శాతం మహిళలే ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఈ ప్రతిపాదన భారతీయ మహిళా ఉద్యోగులపై ప్రత్యేక ప్రభావం చూపే అవకాశం ఉంది.

### ప్రతిపాదన దశలో ప్లాన్

అయితే హెచ్ 4 ఉద్యోగ అనుమతులు వెంటనే రద్దు కావడం లేదు. ఇది ప్రస్తుతం ప్రతిపాదన మాత్రమే. అమల్లోకి రావాలంటే హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ విభాగం ముందుగా అధికారిక ప్రతిపాదనను ఫెడరల్ రిజిస్టర్‌లో ప్రచురించాలి. ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలి. ఆ ప్రక్రియ పూర్తయ్యాక తుది నిబంధనను ప్రకటించాలి. అప్పటివరకు చెల్లుబాటు అయ్యే ఈఏడీ ఉన్న హెచ్ 4 జీవిత భాగస్వాములు ప్రస్తుత నిబంధనల ప్రకారం ఉద్యోగాలు కొనసాగించవచ్చు. హెచ్ 4 వీసా స్వయంగా ఉద్యోగం చేసుకునే అనుమతి ఇవ్వదు. హెచ్ 1బీ వీసాదారుడి జీవిత భాగస్వామి లేదా పిల్లలు అమెరికాలో నివసించేందుకు ఈ వీసా ఉపయోగపడుతుంది. ఉద్యోగం చేసేందుకు అర్హత ఉన్న జీవిత భాగస్వామికి ప్రత్యేక ఈఏడీ అవసరం. సాధారణంగా గ్రీన్‌కార్డ్ ప్రక్రియలో ఉన్న హెచ్ 1బీ వీసాదారుల జీవిత భాగస్వాములకే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇలాంటి ప్రతిపాదన గతంలోనూ వచ్చింది. ట్రంప్ తొలి పాలనా కాలంలో 2017లో హెచ్ 4 ఈఏడీని తొలగించే ప్రయత్నం జరిగినా అది తుది నిబంధనగా మారలేదు.

### హెచ్-1బీపై వరుస దెబ్బలు

హెచ్ 4 ఈఏడీపై తాజా ప్రతిపాదన ఒక్కటే కాదు. హెచ్ 1బీ వ్యవస్థపై అమెరికా ప్రభుత్వం వరుసగా కఠిన చర్యలు పరిశీలిస్తోంది. కొత్త హెచ్ 1బీ నియామకాలకు భారీగా ఫీజు పెంచే ప్రతిపాదన కూడా ఉంది. ఉద్యోగం కోల్పోయిన హెచ్ 1బీ ఉద్యోగులకు కొత్త యజమాని కోసం వెతకడానికి ప్రస్తుతం ఉన్న 60 రోజుల వ్యవధిని తొలగించే ప్రతిపాదనపై కూడా చర్చ జరుగుతోంది. ఈ పరిణామాల మధ్య భారతీయులపై ప్రభావం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 2024 ఆర్థిక సంవత్సరంలో ఆమోదమైన హెచ్ 1బీ పిటిషన్లలో సుమారు 71 శాతం భారతీయులవేనని గణాంకాలు చెబుతున్నాయి. దీంతో హెచ్ 1బీ ఉద్యోగులు మాత్రమే కాకుండా వారిపై ఆధారపడిన కుటుంబాల భవిష్యత్తుపైనా అమెరికా వీసా విధానాల మార్పులు ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే హెచ్ 4 ఈఏడీ రద్దు ఇప్పటికీ తుది నిర్ణయం కాదు. కాబట్టి ప్రస్తుతానికి చెల్లుబాటు అయ్యే వర్క్ పర్మిట్ ఉన్నవారు ఉద్యోగాలు కొనసాగించవచ్చు. తుది నిబంధన ఎప్పుడు వస్తుంది, దాని పరిధి ఎంత ఉంటుంది, ప్రస్తుత ఈఏడీలపై ఎలాంటి ప్రభావం ఉంటుంది అన్నది తదుపరి అధికారిక ప్రక్రియలోనే స్పష్టమవుతుంది.

## అర్జీలను సమగ్రంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టరేటు గోదావరీ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు పరిష్కార వ్యవస్థ కార్యక్రమంను జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా జాయింటు కలెక్టరు డా.యం.జె.అభిషేక్ గౌడ, అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా అటవీశాఖ అధికారి పి.వి.సంధీఫ్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి యం.శ్రీదేవి, విజిలెన్స్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు ఎల్.దేవకీదేవి, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవో లు కె.లక్ష్మిప్రసన్న, యం.వి.రమణ లు ప్రజలు నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ అర్జీలు పునరావృతం కాకుండా లబ్ధిదారులు సంతృప్తిని దృష్టిలో ఉంచుకుని పరిష్కారం అందించాల్సిన బాధ్యత అధికారులుపై ఉందని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులుతో నేరుగా మాట్లాడి సమస్యలకు కారణాలను తెలుసుకుని, శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. ప్రజలు మళ్లీ మళ్లీ అదే సమస్యతో అర్జీలు పెట్టాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



## కడప జిల్లాలో జగన్ రెండు రోజుల పర్యటన

- నేడు, రేపు పులివెందులలో వైసీపీ అధినేత

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నేడు, రేపు పులివెందులలో పర్యటించనున్నారు. ఇవాళ మధ్యాహ్నం 12 గంటలకు పులివెందులకు చేరుకోనున్న జగన్, భాకరాపురంలోని క్యాంప్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. అనంతరం రాత్రి పులివెందులలోని తన నివాసంలో బస చేయనున్నారు. సెప్టెంబర్ 2న ఉదయం పులివెందుల నుంచి బయలుదేరి 7.45 గంటలకు ఇడుపులపాయకు చేరుకుంటారు. అక్కడ తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ ఘాట్ వద్ద నిర్వహించే కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పిస్తారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉంది. తండ్రి వర్ధంతి సందర్భంగా ప్రతి ఏడాది ఇడుపులపాయలో వైఎస్ జగన్ నివాళులు అర్పించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈసారి కూడా కుటుంబ సభ్యులు, పార్టీ నేతలతో కలిసి కార్యక్రమంలో పాల్గొననున్నారు. వర్ధంతి కార్యక్రమం ముగిసిన అనంతరం జగన్ ఇడుపులపాయ నుంచి తిరుగు ప్రయాణమవుతారు. ఆయన పర్యటన నేపథ్యంలో స్థానిక పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## అమెరికా–కెనడా మధ్య వాణిజ్య యుద్ధం

- కెనడా దారుణమైన దుర్వినియోగదారు
- అక్కడ ఉన్న కంపెనీలన్నీ అమెరికాకు వచ్చేయాలి
- ట్రూత్‌లో ట్రంప్ వరుస పోస్టులు

అమెరికా 'కెనడా మధ్య వాణిజ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ సహా ఇతర నేతలు గట్టిగా బదులు ఇస్తుండటంతో రెండు దేశాలు సంబంధాలు దిగజారుతున్నాయి. ఈ క్రమంలోనే ట్రంప్ మరోసారి ఆ దేశంపై విరుచుకుపడ్డారు. తమకు కెనడా నుంచి ఏమీ వద్దని పేర్కొన్న ఆయన తమ సుంకాలను తప్పించుకునేందుకు అక్కడి కంపెనీలన్నీ అమెరికాకు తరలివచ్చేయాలని సూచించారు. ఆ దేశం దారుణమైన దుర్వినియోగదారు అని మండిపడ్డారు. ఈ మేరకు ట్రూత్‌లో వరుస పోస్టులు పెట్టారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నానని ప్రకటించిన సమయంలోనే డెట్రాయిట్‌లోని కీలక ఫ్యాక్టరీని మూసివేయడానికి ఫోర్డ్ సిద్ధమైంది. ఎన్నికల్లో నేను ఆధిక్యంలోకి రావడంతో ఏం జరుగుతుందో చూద్దామని ఆ సంస్థ వేచి చూసింది. ఇప్పుడు నిరంతరాయంగా నడుస్తూ.. భారీగా లాభాలను ఆర్జిస్తోంది. జనరల్ మోటార్స్, ఇతర సంస్థల విషయంలో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సుంకాల వల్లే ఇదంతా జరిగింది. మనకు కెనడియన్ కార్లు, పరికరాలు సహా ఏమీ వద్దు. కెనడాతో వాణిజ్యంలో అమెరికా ఏటా 60 బిలియన్ డాలర్లుకుపైగా నష్టపోతోంది. దశాబ్దాలుగా ఈ దోపిడీ జరుగుతోంది. ఏనాడో మననుంచి లాగేసుకున్న వ్యాపారాలన్నీ సుంకాలను తప్పించుకోవడానికి ఇప్పుడు అమెరికాకు బారులు తీరుతున్నాయి. కెనడా పట్ల కఠిన వైఖరిని అవలంబించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ట్రంప్ విమర్శలు చేశారు. అమెరికా 'కెనడా మధ్య వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో రద్దయింది. అమెరికా ఇప్పటికే 50 శాతం సుంకాలతో విరుచుకుపడగా.. కెనడా సైతం అగ్రరాజ్యంపై తాజాగా ప్రతీకార సుంకాలు విధించిన సంగతి తెలిసిందే. కెనడియన్ కార్లు, ట్రక్కులు, ఆటోమోటివ్ విడిభాగాలు, ఉక్కు దిగుమతులపై ట్రంప్ 50శాతం టారిఫ్‌లు విధించారు.

రాజ్య సంస్కరణ
మంగళవారం, 1.9.2026, మేడ్చల్ మల్కాజిగిరి

# మరపురాని మనిషి బుచ్చిబాబు

– పడాల వీరభద్రరావు

కొంతమంది మనుషులు మన జీవితంలోకి వచ్చి వెళ్లిపోరు.. మన జీవితంలోనే ఒక భాగంగా నిలిచిపోతారు. వారి మాట, ఆప్యాయత, నవ్వు, పలకరింపు, మనతో గడిపిన ప్రతి చిన్న క్షణం కాలం గడిచినా మనసును విడిచిపెట్టదు. నా తమ్ముడు బుచ్చిబాబు పడాల కూడా అలాంటి మనిషే. ఆగస్టు 14న ఆయన మనల్ని విడిచి వెళ్లారన్న వార్తను జీర్ణించుకోవడం మాకు ఇప్పటికీ కష్టంగానే ఉంది. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా.. కుటుంబ సభ్యుల జ్ఞాపకాల్లో, బంధువుల అనుబంధాల్లో, స్నేహితుల మాటల్లో ఆయన ఎప్పటికీ జీవించే ఉంటారు. ఇంట్లో ఆయన లేని లోటు ప్రతిరోజూ కనిపిస్తుంది. ఆయన కూర్చున్న చోటు, ఆయన ఫొటో, ఆయనతో మాట్లాడిన సందర్భాలు.. అన్నీ ఇప్పుడు మధురమైన జ్ఞాపకాలుగా మారాయి. తమ్ముడిని కోల్పోయిన బాధను మాటల్లో చెప్పలేను. కానీ ఆయన మాకు ఇచ్చిన ప్రేమను, అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ ఆయన జ్ఞాపకాలను జీవితాంతం మాతోనే మోసుకెళ్తాం.

### భార్యకు కంటికి రెప్పలా

బుచ్చిబాబు అనారోగ్యానికి గురైన సమయంలో ఆయన భార్య ప్రభావతి చూపిన ప్రేమ, సేవలను జీవితాంతం గుర్తుంచుకోవాలి. కష్టకాలంలో భర్తకు అండగా నిలిచి, కంటికి రెప్పలా చూసుకున్నారు. కుమారుడు పడాల సురేంద్ర కోడలు ప్రణతి, కుమార్తె స్వప్న, అల్లుడు వీర్రాజు కూడా ఆయన ఆరోగ్యం కోసం ఎంతో శ్రద్ధ చూపించారు. కుటుంబ సభ్యులంతా ఆయనకు అండగా నిలిచిన తీరు బుచ్చిబాబుపై వారికి ఉన్న ప్రేమకు నిదర్శనం. అనారోగ్య సమయంలో ఆయనకు సేవ చేయడం మాత్రమే కాదు.. చివరి వరకు ఆయనకు ధైర్యాన్ని ఇవ్వడం కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని తెలియజేస్తుంది. ఇప్పుడు ఆయన లేకపోవడం వారి జీవితాల్లో తీరని లోటు. అయినా తండ్రితో గడిపిన ప్రతి క్షణం వారి జీవితంలో విలువైన జ్ఞాపకంగా మిగిలిపోతుంది. ఆయన ఫొటోను చూసిన ప్రతిసారీ ఒక మనిషిగా ఆయన ఎంత విలువైనవారో గుర్తుకొస్తూనే ఉంటుంది.





### సోదరుడిగా నా బాధ్యత

బుచ్చిబాబు ఆస్పత్రిలో ఉన్నప్పటి నుంచే అన్నగా ఆయన ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వచ్చాను. ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పడం నా బాధ్యతగా భావించాను. ఆయనను కోల్పోయిన తర్వాత ఆ బాధ్యత మరింత పెరిగింది. తమ్ముడిని తిరిగి తీసుకురాలేనన్న నిజం ఎంత బాధాకరమైనదైనా.. ఆయన కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టకూడదన్న నిర్ణయం తీసుకున్నాను. బంధుమిత్రుల సహకారంతో అంత్యక్రియల నుంచి అనంతర కార్యక్రమాల వరకు ప్రతి బాధ్యతను దగ్గరుండి నిర్వహించాను. ఇది నేను చేసిన ఉపకారం కాదు.. నా తమ్ముడిపై నాకున్న ప్రేమ, అతని కుటుంబంపై నాకున్న బాధ్యత. జీవితంలో సోదర బంధానికి ఉన్న విలువ ఇలాంటి సమయంలోనే తెలుస్తుంది. బుచ్చిబాబు ఇక మనతో మాట్లాడలేకపోయినా.. ఆయన కుటుంబం సంతోషంగా ఉండటమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి.

### జ్ఞాపకాలే ఆయనకు చిరునామా

మనిషి శరీరంగా దూరమైనా.. అతను పంచిన ప్రేమ దూరం కాదు. మనతో గడిపిన క్షణాలు కాలంతో చెరిగిపోవు. బుచ్చిబాబు కూడా తనవారికి అలాంటి జ్ఞాపకాలనే మిగిల్చి వెళ్లారు. ఆయన గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆయన నవ్వు గుర్తుకొస్తుంది. ఆయన ఫొటో చూసిన ప్రతిసారీ ఆయనతో గడిపిన రోజులు కళ్లముందు కదులుతాయి. కుటుంబ సభ్యుల జీవితాల్లో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరు. కానీ ఆయన జ్ఞాపకాలు మాత్రం తరతరాలకు అందాలి. పిల్లలు తమ తండ్రి గురించి చెప్పుకునే ప్రతి మాటలో, భార్య తన జీవిత భాగస్వామిని గుర్తుచేసుకునే ప్రతి సందర్భంలో, సోదరులుగా మేము పంచుకునే ప్రతి జ్ఞాపకంలో బుచ్చిబాబు మన మధ్యే ఉంటారు. నా తమ్ముడికి ఇదే మా కుటుంబం అందించే శాశ్వత నివాళి. బుచ్చిబాబు ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ.. ఆయన కుటుంబ సభ్యులకు, బంధువులకు నా ప్రగాఢ సానుభూతి.



## పైరవీలు వద్దు నేరుగా పోలీసులను ఆశ్రయించండి

ప్రజలు ఎలాంటి భయాందోళనలు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీసులను సంప్రదించి సేవలు పొందవచ్చని వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె 13 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. బాధితుల సమస్యలను స్వయంగా విని, చట్టపరమైన పరిష్కారం కోసం సంబంధిత ఎస్సైలు, సీఐలకు ఫోన్ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, బాధితులకు సత్వర న్యాయం అందించడమే ప్రజావాణి లక్ష్యమని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించిన మూడు, కుటుంబ సమస్యలపై మూడు, ఇతర గొడవలకు సంబంధించిన ఏడు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ఎలాంటి పైరవీలు, మధ్యవర్తుల అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సునిత రెడ్డి కోరారు.

## మహబూబ్‌నగర్‌లో 30 పోలీస్ యాక్ట్ అమలు



మహబూబ్‌నగర్ జిల్లాలో శాంతిభద్రతలు, ప్రజా ప్రశాంతత పరిరక్షణ కోసం సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమల్లో ఉంటుందని ఎస్పీ డి.జానకి తెలిపారు. ఈ కాలంలో ముందస్తు పోలీసు అనుమతి లేకుండా ర్యాలీలు, ఊరేగింపులు, ధర్నాలు, నిరసనలు, బహిరంగ సభలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. సభలు, సమావేశాలు నిర్వహించాలనుకునే వారు తప్పనిసరిగా పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. సోషల్ మీడియా వేదికగా వదంతులు వ్యాప్తి చేయడం, మత విద్వేషాలు రెచ్చగొట్టడం, సామాజిక ఉద్రిక్తతలకు కారణమయ్యే పోస్టులు, సందేశాలు ప్రచారం చేయడంపైనా కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సెక్షన్ 30 అమలును ప్రతి ఒక్కరూ పాటించాలని సూచించారు.

## గిరిజన విద్యార్థినికి అండగా మర్రి



గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో ఎదగాలనే లక్ష్యంతో నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మరోసారి ఉదారత చాటుకున్నారు. మండలంలోని పర్వతాయిపల్లి తండాకు చెందిన ముదావత్ సత్యం కుమార్తె అనూష హైదరాబాద్‌లోని శ్రీ హిందూ ఇంజినీరింగ్ కాలేజీలో ఉచిత సీటు పొందింది. అయితే కుటుంబ ఆర్థిక పరిస్థితి కారణంగా హాస్టల్ ఫీజు చెల్లించడం కష్టంగా మారింది. విషయం తెలుసుకున్న మర్రి జనార్దన్‌రెడ్డి తన ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా గత ఏడాది మొదటి సంవత్సరం హాస్టల్ ఫీజు కోసం రూ.50 వేల సాయం అందించారు. తాజాగా వరుసగా రెండో సంవత్సరం కూడా అనూష చదువుకు అండగా నిలిచారు. హాస్టల్ ఫీజు కోసం మరో రూ.50 వేల చెక్కును ఆమెకు అందజేశారు. పేదరికం ఏ విద్యార్థి భవిష్యత్తుకు అడ్డంకి కాకూడదనే ఉద్దేశంతో విద్యార్థులకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## దేవరకద్రలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం

పేద విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్‌లో 22 ఎకరాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించి కాంక్రీట్ పనులు ప్రారంభించారు. ఒకటి నుంచి 12వ తరగతి వరకు 2,720 మంది విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కౌకుంట్లలో మోడల్ స్కూల్ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ఆధునిక ల్యాబ్‌లు, డిజిటల్ తరగతి గదులు, హాస్టల్ సదుపాయాలతో విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. విద్యారంగంలో మౌలిక వసతులను బలోపేతం చేసి పేద పిల్లలకు ఉన్నత ప్రమాణాల విద్య అందించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



## రూ.66 కోట్లతో గద్వాల స్టేషన్ అభివృద్ధి

తెలంగాణలో రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద రూ.42.82 కోట్లతో జరుగుతున్న గద్వాల రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ, కలెక్టర్ రిజ్వాన్ భాషా, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి పరిశీలించారు. రాష్ట్రంలో ఒకేసారి 42 రైల్వే స్టేషన్లను ఆధునికీకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు. 2027 ఏప్రిల్ నాటికి గద్వాల స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేసి, ప్రాంతాన్ని ప్రధాన రైల్వే హబ్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి రూ.66 కోట్లతో మరో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. గద్వాల రైల్వే స్టేషన్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కిషన్‌రెడ్డికి అందజేశారు.

## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి జూపల్లి సీరియస్



వీపనగండ్ల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. మండలానికి కేటాయించిన 375 ఇళ్లలో ఇప్పటివరకు 321 మంది లబ్ధిదారులను గుర్తించగా, మరో 54 మంది ఎంపిక పెండింగ్‌లో ఉండటంపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు మూడు రోజుల్లో ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గెజిటెడ్ అధికారుల వెరిఫికేషన్, శాంక్షన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఎల్3 జాబితాలోని అర్హుల వివరాలను పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీవోలకు అందించాలని తెలిపారు. హౌసింగ్ లాగిన్‌లోని ఎల్3 నుంచి ఎల్1 మాడ్యూల్ ద్వారా వారంలోగా వివరాలను కలెక్టర్‌కు పంపాలని స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, విద్యుత్, రెవెన్యూ శాఖల పనుల పురోగతిపైనా మంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు. విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

# వెలిగొండపై క్రెడిట్ వార్



## జగన్‌పై మండిపల్లి ఫైర్

వెలిగొండ ప్రాజెక్టుకు జీవం పోసింది ఎన్టీఆర్ తీసుకొచ్చిన 409 జీవో అని, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి, పట్టుదలతో ప్రాజెక్టు పనులు ముందుకు సాగుతున్నాయని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ వెలిగొండ క్రెడిట్‌ను జగన్ ప్రభుత్వం చోరీ చేసుకునేందుకు సాక్షి వాస్తవాలను వక్రీకరిస్తోందని ఆరోపించారు. జగన్ హయాంలో సుమారు రూ.1,200 కోట్లతో మట్టి పనులు చేసి గొప్పగా ప్రచారం చేసుకున్నారని విమర్శించారు. రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులను పక్కనపెట్టి, కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోలేదన్నారు. ఇసుక, మద్యం, మైనింగ్‌లో దోపిడీ జరిగిందని, నాడు--నేడు కార్యక్రమంలో రూ.11 వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. రాయచోటి, పీలేరు, తంబళ్లపల్లె, కుప్పం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌కు సబ్సిడీలు, హార్టికల్చర్‌కు రూ.లక్ష కోట్ల పెట్టుబడులతో రాయలసీమను అభివృద్ధి చేస్తామని చెప్పారు. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి శాశ్వత నీటి భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

## కరువు నేలకు కృష్ణమ్మ

### చంద్రబాబు ఘనతన్న ఎమ్మెల్యే మాలకొండయ్య



కరువు నేలకు కృష్ణా జలాలను తరలించి తాగు, సాగునీటి కష్టాలు తీర్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిదేనని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. వెలిగొండ ఫేజ్–1 ద్వారా నల్లమల సాగర్‌కు నీటి విడుదల కార్యక్రమం అనంతరం ఆయన మాట్లాడారు. 1996లో వెలిగొండకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే, నేడు స్వయంగా నీటిని విడుదల చేసి ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేశారని తెలిపారు. గత ప్రభుత్వం నీళ్లు లేకుండానే వెలిగొండను పూర్తి చేసినట్లు ప్రచారం చేసి ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. వెలిగొండతో పాత పశ్చిమ ప్రకాశం ప్రాంతాలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. మరో రెండు రోజుల్లో పోలవరం కుడికాలువ ద్వారా నీటి విడుదల జరగనుందని తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఉన్నా పట్టిసీమ కృష్ణా డెల్టాను ఆదుకుంటోందన్నారు. చీరాల నియోజకవర్గంలోని ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేసి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మాలకొండయ్య హామీ ఇచ్చారు.



## నాలుక కోస్తానంటే రా చూసుకుందాం!

### రాచమల్లుకు వరదరాజులరెడ్డి సవాల్

### రాజగోపాల్‌ను ముట్టుకుంటే అంతే సంగతులు

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డిపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వ్యాపారులపై రాచమల్లుకు ప్రేమ లేదని, స్వార్థ ప్రయోజనాలే ఉన్నాయని ఆరోపించారు. గతంలో భారీగా డబ్బులు వసూలు చేసే కార్పొరేట్ సంస్థలకు అనుమతులు ఇచ్చారని, వ్యాపారులపై ప్రేమ ఉంటే వాటిని ఎందుకు ప్రోత్సహించారని ప్రశ్నించారు. బీసీ నేత చల్లా రాజగోపాల్‌ను ముట్టుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

రాజగోపాల్‌పై చేయి వేసి చూడాలని, నాలుక కోస్తానంటున్న రాచమల్లు ఎప్పుడు కోస్తారో చెప్పాలని, తాను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. బీసీలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని, అహంకారం తగ్గించుకోకపోతే పతనం తప్పదన్నారు. వ్యాపార అవసరాలకు అప్పులు చేయడం సహజమేనని, తీసుకున్న డబ్బులు ఎగ్గొట్టే చరిత్ర తమకు లేదని విమర్శించారు. డ్వాక్రా మహిళల నుంచి రూ.35 వేల చొప్పున తీసుకున్న డబ్బుల వ్యవహారంపై రాచమల్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బాధిత మహిళలతో ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. టీడీపీ కార్యకర్తల జోలికి వచ్చినా తీవ్ర పరిణామాలు తప్పవని వరదరాజులరెడ్డి హెచ్చరించారు.



## తెలంగాణ జల ప్రయోజనాలకు తీవ్ర విఘాతం

### వెలిగొండపై నిరంజన్‌రెడ్డి తీవ్ర ఆరోపణలు

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఏపీ ప్రభుత్వం కృష్ణా వరద జలాలతో పాటు నికర జలాలను తరలిస్తుంటే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మౌనం వహించడం తెలంగాణ జల ప్రయోజనాలకు తీవ్ర విఘాతమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. వెలిగొండ ప్రారంభం తెలంగాణకు దుర్దినమని వ్యాఖ్యానించారు. మహబూబ్‌నగర్ బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల కేటాయింపుల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను డయాగ్రమ్‌లతో వివరించారు. చంద్రబాబు జలచౌర్యానికి రేవంత్ ప్రభుత్వం లొంగిపోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తయిన పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని కాంగ్రెస్ పక్కనపెట్టిందని ఆరోపించారు. ఏపీ 235 టీఎంసీల నిల్వ సామర్థ్యం పెంచుకుంటుండగా, తెలంగాణలో ఎస్ఎల్‌బీసీ పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రాజెక్టుల కోసం నిజాయితీగా పోరాడామని, బీఆర్ఎస్ నేతలపై నిరాధార ఆరోపణలు చేస్తే సహించబోమని నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు.

## సీడ్ గణేశుడిని పూజించడం మంచిది

### పర్యావరణ హితానికి అది ఎంతో మేలు.. మెగాస్టార్ చిరంజీవి పిలుపు



వినాయక చవితి సందర్భంగా పర్యావరణహిత విగ్రహాలను ప్రోత్సహించాలని మెగాస్టార్ చిరంజీవి పిలుపునిచ్చారు. ప్రకృతి సంరక్షణ, పచ్చదనం పెంపు కోసం ఈసారి అందరూ సీడ్ గణెళిశుడిని పూజించాలని కోరారు. మట్టి వినాయకుడిని పూజించడం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని చెప్పారు. సీడ్ గణెళిశుడిని పూజించిన అనంతరం ఇంట్లోనే నిమజ్జనం చేస్తే.. అందులోని విత్తనం మొలకెత్తి మొక్కగా ఎదిగి మనల్ని ఆశీర్వదిస్తుందని అన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపొందించిన సీడ్ గణెళిశా ప్రతిమలను చిరంజీవి ఆదివారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌ను ఓ యజ్ఞంలా భావించి ఇప్పటికే కోట్లాది మొక్కలు నాటేలా ప్రజలను ప్రోత్సహిస్తున్న సంతోష్ కుమార్‌ను అభినందించారు. ఆయన చేస్తున్న కృషికి తమ వంతు సహకారం అందిస్తామని చెప్పారు. వినాయక చవితి సందర్భంగా పండుగ ఉత్సాహంతో పాటు ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరిగేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. సీడ్ గణేశుడిని ఆరాధించడం ద్వారా అటు పుణ్యం.. ఇటు పురుషార్థం.. అంటే ప్రకృతిని కాపాడే బాధ్యత దక్కుతుంది' అని చిరంజీవి అన్నారు. 'వినాయక చవితి వచ్చిందంటే ఊరూవాడా వేడుకలే. అయితే ఇటీవల పోటీ పెరిగిపోవడంతో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నారు. దీంతో నీళ్లు కలుషితమవుతున్నాయి. పండుగతో అందరికీ ఆరోగ్యం అందాలి. భగవంతుడి ఆశీస్సులు లభించాలి. ఈ నేపథ్యంలో సోదర సమానుడైన సంతోష్ సీడ్ గణేశాను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం అని చెప్పారు.

### భారత్ - బంగ్లా సరిహద్దుల్లో

## భారీగా బంగారం పట్టివేత

భారత్ –బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో అక్రమంగా దాచి ఉంచిన బంగారాన్ని బీఎస్‌ఎఫ్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. పశ్చిమబెంగాల్–బంగ్లాదేశ్ సరిహద్దులోని బన్‌పూర్ గ్రామంలో ఓ మహిళ కొంతకాలంగా అనుమానాస్పదంగా సంచరిస్తుండటాన్ని జవాన్లు గమనించారు. అనంతరం ఆమెపై నిఘా పెట్టి ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలోనే మహిళ ఇంట్లో సోదాలు చేయగా.. 15.6 కిలోల బంగారం బయటపడింది. దాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ పసిడి విలువ రూ.24కోట్లకు పైనే ఉంటుందని అధికారులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో బంగారం సరిహద్దుకు ఎలా చేరింది? దానిని ఎవరికి ఇవ్వడానికి మహిళ ప్రయత్నిస్తుందనే వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ దిశగా ఆరా తీస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.?

## చదువు రావడం లేదని.. విద్యార్థి ఆత్మహత్య

మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుభాష్ చంద్రబోస్ నగర్‌లో విషాద ఘటన చోటుచేసుకుంది. చదువు సరిగా రావడం లేదనే మనస్తాపంతో 16 ఏళ్ల పదో తరగతి విద్యార్థి మల్లికార్జున్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. మల్లికార్జున్ తండ్రి పెయింటింగ్ పని చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

విద్యార్థి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మియాపూర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు దారితీసిన పూర్తి కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కన్న బిడ్డ మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# యూపీలో బీసీరియస్

## బ్యాకౌట్ అవుతున్న బ్యాక్ వర్డ్ క్లాస్

- యోగి పీఠానికి కదులుతున్న బేస్
- యూపీలో మొదలైన వ్యతిరేక సెగ
- ఆదమరిస్తే సెంట్రల్లో కమలం భగభగ



ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు మరో ఏడాది మాత్రమే సమయం ఉండటంతో రాష్ట్ర రాజకీయాల్లో ఓబీసీ ఓటు బ్యాంకు మరోసారి కేంద్రబిందువుగా మారింది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు జరిగే ఈ ఎన్నికలను సెమీఫైనల్‌గా రాజకీయ వర్గాలు చూస్తున్నాయి. దేశంలోనే అత్యధికంగా 80 లోక్‌సభ స్థానాలు ఉన్న ఉత్తరప్రదేశ్‌లో అధికారం ఎవరికి దక్కుతుందనేది జాతీయ రాజకీయాలపై కూడా ప్రభావం చూపుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ఓబీసీ రాజకీయాలు, కులగణన, రిజర్వేషన్ల అంశాలను ముందుకు తెచ్చారు. కులగణన ద్వారా దేశంలోని ప్రతి సామాజిక వర్గం జనాభా ఎంత ఉందో కచ్చితంగా తెలుసుకోవాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. జనాభా ప్రాతిపదికన రాజకీయ, సామాజిక ప్రాతినిధ్యం కల్పించాలన్న నినాదాన్ని రాహుల్ గాంధీ బలంగా వినిపిస్తున్నారు. కులగణనను ఆయన "భారత్‌కు ఎక్స్‌రే"గా అభివర్ణిస్తున్నారు. అంటే దేశంలోని ఏ వర్గానికి ఎంత ప్రాతినిధ్యం ఉంది, ఎక్కడ వెనుకబాటుతనం ఉంది, ప్రభుత్వ విధానాల్లో ఎవరు ఎంత మేరకు భాగస్వామ్యం పొందుతున్నారు అన్నది డేటా ద్వారా తెలుసుకోవాలన్నదే కాంగ్రెస్ వాదన. అయితే ప్రస్తుతం జరుగుతున్న జాతీయ జనగణనలో ప్రత్యేకంగా ఓబీసీ కాలమ్ లేకపోవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ప్రశ్నిస్తోంది. ఇది సాధారణ సాంకేతిక అంశం కాదని, ఓబీసీ జనాభా వాస్తవ లెక్కలను పక్కన పెట్టే ప్రయత్నంగా కాంగ్రెస్ విమర్శిస్తోంది. మరోవైపు కులగణనకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం విధానాన్ని కాంగ్రెస్ తన రాజకీయ ఒత్తిడి విజయంగా చూపిస్తోంది. ఒకప్పుడు కులగణనకు వ్యతిరేకంగా ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు దానికి అంగీకరించాల్సి వచ్చిందన్నది కాంగ్రెస్ ప్రధాన రాజకీయ వాదనగా మారింది. అయితే కులగణన జరుగుతున్న విధానంపై ఇప్పుడు కొత్త వివాదం మొదలైంది. జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక స్థానం లేకపోతే పూర్తి స్థాయి సామాజిక లెక్కలు ఎలా సాధ్యమవుతాయన్న ప్రశ్న రాజకీయ వేడిని పెంచుతోంది.




### • రిజర్వేషన్లపై కాంగ్రెస్ కొత్త దూకుడు

కులగణన అంశాన్ని కేవలం జనాభా లెక్కలకు పరిమితం చేయకుండా కాంగ్రెస్ రిజర్వేషన్ల 50 శాతం పరిమితి అంశంతో అనుసంధానిస్తోంది. జనాభా వాస్తవ సంఖ్యలు బయటకు వచ్చిన తర్వాత జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను పునఃపరిశీలించాలని రాహుల్ గాంధీ కోరుతున్నారు. మండల్ రాజకీయాల కాలం నుంచి ఉన్న "ఎంత జనాభా ఉంటే అంత ప్రాతినిధ్యం" అనే భావనకు కొత్త రాజకీయ రూపం ఇవ్వడమే కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ అంశం ముఖ్యంగా ఓబీసీ యువతలో ప్రభావం చూపుతుందని కాంగ్రెస్ భావిస్తోంది. మరోవైపు బీజేపీ మాత్రం కాంగ్రెస్ ప్రచారాన్ని "ఓబీసీ వ్యతిరేక రాజకీయాలు"గా తిప్పికొడుతోంది. ఓబీసీ వర్గాలకు బీజేపీ ఇచ్చిన ప్రాధాన్యాన్ని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెనుకబడిన వర్గానికి చెందిన నాయకుడిగా ఎదగడం, కేంద్రం, రాష్ట్రాల్లో ఓబీసీ నాయకులకు కీలక పదవులు దక్కడం తమ సామాజిక న్యాయ విధానానికి ఉదాహరణలని బీజేపీ చెబుతోంది. రాహుల్ గాంధీ కులగణనపై మాట్లాడటం రాజకీయ అవసరమని బీజేపీ విమర్శిస్తోంది. రాజీవ్ గాంధీ కాలంలో ఓబీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ వైఖరిని కూడా బీజేపీ తరచుగా ప్రస్తావిస్తోంది. అయితే ఈ రాజకీయ విమర్శలకు మించి యూపీలో అసలు ప్రశ్న ఓబీసీ ఓటర్ల మనస్తత్వం ఏ దిశగా మారుతోంది? అన్నదే. 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి భారీ విజయాలు రావడానికి ఉన్నత కులాల మద్దతుతో పాటు ఓబీసీ వర్గాల విస్తృత మద్దతు ప్రధాన కారణమైంది. ముఖ్యంగా యాదవేతర ఓబీసీ వర్గాలు బీజేపీ వైపు వెళ్లడం వల్ల సమాజ్‌వాదీ పార్టీకి చెందిన సంప్రదాయ సామాజిక సమీకరణానికి పెద్ద సవాలు ఎదురైంది. 2017 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడానికి కూడా ఈ కూటమి కీలకంగా పనిచేసింది. 2022లోనూ బీజేపీ యూపీలో అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే 2024 లోక్‌సభ ఎన్నికలు ఈ సమీకరణంలో పగుళ్లు మొదలయ్యాయనే సంకేతం ఇచ్చాయి.

### • 2024లో మారిన ఓబీసీ లెక్కలు

2024 లోక్‌సభ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ, కాంగ్రెస్ కలిసి పోటీ చేయడం వల్ల యూపీ రాజకీయాల్లో కొత్త సమీకరణం ఏర్పడింది. ఈ కూటమి 80 లోక్‌సభ స్థానాల్లో 43 స్థానాలు గెలుచుకుంది. బీజేపీ గతంతో పోలిస్తే గణనీయంగా నష్టపోయింది. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ జాతీయ స్థాయిలో 272 స్థానాల మెజారిటీ మార్కును దాటలేకపోవడానికి యూపీలో వచ్చిన ఫలితాలు ముఖ్య కారణాల్లో ఒకటిగా నిలిచాయి. ముఖ్యంగా యాదవేతర ఓబీసీ వర్గాల్లో బీజేపీకి గతంలో ఉన్న మద్దతు కొంత తగ్గినట్టు ఎన్నికల అంచనాలు సూచించాయి. కుర్మీ, కోయిరీ, కుష్వాహా వంటి వర్గాల్లో 2022తో పోలిస్తే బీజేపీ మద్దతు తగ్గిందన్న అంచనాలు వెలువడ్డాయి. కొన్ని అంచనాల ప్రకారం 2022లో ఈ వర్గాల్లో బీజేపీకి సుమారు 66 శాతం మద్దతు ఉండగా, 2024లో అది సుమారు 61 శాతానికి పడిపోయింది. ఇతర ఓబీసీ వర్గాల్లో మద్దతు సుమారు 66 శాతం నుంచి 59 శాతానికి తగ్గినట్టు అంచనా. ఇదే సమయంలో ఇండియా కూటమి మద్దతు ఈ వర్గాల్లో గణనీయంగా పెరిగినట్టు విశ్లేషణలు పేర్కొంటున్నాయి. మొత్తం బీజేపీ ఓటర్లలో ఓబీసీల వాటా కూడా 2022లో ప్రతి 100 మంది బీజేపీ ఓటర్లలో 47 మంది నుంచి 2024లో 43 మందికి తగ్గినట్టు అంచనాలు ఉన్నాయి. ఈ మార్పు వెనుక కులగణన అంశంతో పాటు "రాజ్యాంగం ప్రమాదంలో ఉంది" అనే కాంగ్రెస్ ప్రచారం కూడా ప్రభావం చూపిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ సంఖ్యలను కచ్చితమైన ఎన్నికల గణాంకాలుగా కాకుండా వివిధ ఎన్నికల అనంతర అంచనాలుగా చూడాలి. అయినప్పటికీ బీజేపీకి ఓబీసీ మద్దతులో వచ్చిన మార్పు రాజకీయంగా గమనించదగ్గదే. ముఖ్యంగా బీజేపీ విజయాలకు కీలకంగా నిలిచిన యాదవేతర ఓబీసీ వర్గాలు పూర్తిగా ఒకే పార్టీ వెనుక ఉండటం లేదన్న సంకేతం 2024 ఫలితాల్లో కనిపించింది. ఇదే మార్పును వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మరింత విస్తరించాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

### • పిడిఏ ఫార్ములాతో అఖిలేష్ వ్యూహం

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ 2024 ఎన్నికల్లో "పిడిఏ" ఫార్ములాను ముందుకు తెచ్చారు. పిడిఏ అంటే పిచ్‌డా, దళిత్, అల్పసంఖ్యాక వర్గాల సమీకరణ. గతంలో సమాజ్‌వాదీ పార్టీపై ఉన్న యాదవ్‌ముస్లిం పార్టీ అనే ముద్రను తొలగించేందుకు అభ్యర్థుల ఎంపికలో కూడా మార్పులు చేశారు. యాదవులకు కేవలం ఐదు టికెట్లు, ముస్లింలకు నాలుగు టికెట్లు ఇచ్చినట్టు ఈ విశ్లేషణ పేర్కొంటోంది. అదే సమయంలో యాదవేతర ఓబీసీలకు 27 స్థానాలు, షెడ్యూల్డ్ కులాలకు 15, ఉన్నత కులాలకు 11 టికెట్లు ఇచ్చారు. దీంతో సమాజ్‌వాదీ పార్టీ తన సామాజిక పరిధిని విస్తరించేందుకు ప్రయత్నించింది. ఫలితాలు కూడా ఆ వ్యూహానికి కొంత బలం ఇచ్చాయి. యాదవ ప్రభావం ఉన్న 68 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఇండియా కూటమి 44 చోట్ల ఆధిక్యంలో నిలిచింది. 2022తో పోలిస్తే ఇది ఎనిమిది స్థానాలు ఎక్కువ. కుర్మీ ప్రభావం ఉన్న ప్రాంతాల్లో మార్పు మరింత స్పష్టంగా కనిపించింది. ఇండియా కూటమి 23 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యం సాధించగా, 2022తో పోలిస్తే 14 స్థానాల పెరుగుదల నమోదు చేసింది. కుర్మీకోయిరీకుష్వాహా ప్రభావం ఉన్న 60 స్థానాల్లో ఇండియా కూటమి 41 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యం సాధించినట్టు విశ్లేషణలో పేర్కొన్నారు. ఇది 2022తో పోలిస్తే 27 స్థానాల పెరుగుదల. మరోవైపు ఎన్డీఏ ఆధిక్యం గణనీయంగా తగ్గింది. ఈ మార్పులను బీజేపీకి ఎదురైన సామాజిక సమీకరణ సమస్యకు సంకేతంగా రాజకీయ పరిశీలకులు చూస్తున్నారు. మొత్తం ఓట్ల శాతంలో రెండు కూటములు సుమారు 44 శాతం చొప్పున ఉన్నట్టు అంచనాలు పేర్కొంటున్నాయి. అంటే చిన్న ఓటు మార్పులు కూడా భారీ స్థాయిలో అసెంబ్లీ సీట్లపై ప్రభావం చూపే పరిస్థితి యూపీలో ఉంది. ఓబీసీ ప్రభావిత ప్రాంతాల్లో స్వల్ప స్వింగ్ కూడా వందకు దగ్గరగా అసెంబ్లీ సెగ్మెంట్ల ఫలితాలను మార్చగలదన్నదే ఈ లెక్కల అసలు అర్థం.

### • యువత అసంతృప్తి.. బీజేపీకి మరో సవాల్

కులగణన, రిజర్వేషన్లతో పాటు ఇప్పుడు యువత అసంతృప్తి కూడా ఓబీసీ రాజకీయాల్లో కొత్త అంశంగా మారుతోంది. ఉద్యోగాల కొరత, పోటీ పరీక్షల సమస్యలు, పేపర్ లీక్‌ల ఆరోపణలు వంటి అంశాలు యువ ఓటర్లలో అసంతృప్తిని పెంచుతున్నాయని కాంగ్రెస్ వాదిస్తోంది. ముఖ్యంగా బీజేపీకి గతంలో బలంగా నిలిచిన యాదవేతర ఓబీసీ యువతను ఆకర్షించడమే కాంగ్రెస్ వ్యూహంలో కీలక భాగంగా కనిపిస్తోంది. అయోధ్య రామ మందిరానికి సంబంధించిన విరాళాల వ్యవహారంలో వచ్చిన "చందా చోరీ" ఆరోపణలను కూడా ప్రతిపక్షం రాజకీయ అంశంగా ఉపయోగించుకోవాలని చూస్తోంది. మధ్య వయసు, వృద్ధ ఓబీసీ ఓటర్లలో ఈ అంశం ప్రభావం చూపవచ్చని కాంగ్రెస్ భావిస్తోంది. బీజేపీ మాత్రం ఈ పరిణామాలను ముందుగానే గుర్తించి తన సామాజిక సమీకరణాన్ని బలోపేతం చేసే ప్రయత్నం చేస్తోంది. కుర్మీ సామాజిక వర్గానికి చెందిన పంకజ్ చౌధరీని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా నియమించడం ఈ వ్యూహంలో భాగంగా రాజకీయంగా ప్రాధాన్యం పొందింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కుర్మీలతో పాటు ఇతర యాదవేతర ఓబీసీ వర్గాలకు ఎక్కువ టికెట్లు ఇవ్వాలని బీజేపీ యోచిస్తున్నట్టు సమాచారం. తద్వారా 2024లో ఏర్పడిన ఓటు మార్పును తిరిగి తమవైపు తిప్పుకోవాలని పార్టీ ప్రయత్నిస్తోంది. బీజేపీకి మరో బలం హిందుత్వ రాజకీయాలు. రామ మందిరం, జాతీయ భద్రత, మోదీ నాయకత్వం వంటి అంశాలతో ఓబీసీ ఓటర్లను తిరిగి సమీకరించేందుకు పార్టీ ప్రయత్నించే అవకాశం ఉంది. అదే సమయంలో కాంగ్రెస్, ఎస్పీ కులగణన, రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్లు, ఉద్యోగాలు వంటి అంశాలతో ప్రత్యామ్నాయ రాజకీయ కథనాన్ని నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నాయి. అందుకే వచ్చే యూపీ ఎన్నికలు కేవలం బీజేపీ వర్సెస్ ఎస్పీకాంగ్రెస్ పోరుగా కాకుండా ఓబీసీ ఓటు ఎటు తిరుగుతుందన్న పరీక్షగా మారు తున్నాయి.

### • ఓబీసీ తీర్పే పార్టీల తలరాత మార్చేది!

ఉత్తర ప్రదేశ్‌లో ఓబీసీ జనాభా సుమారు 40 శాతం ఉంటుందని అంచనాలు ఉన్నాయి. ఇందులో యాదవులు దాదాపు 11 శాతం, కుర్మీలు సుమారు 5 శాతం, కోయిరీకుష్వాహా వర్గాలు సుమారు 4 శాతం, మిగిలిన ఇతర ఓబీసీ వర్గాలు సుమారు 20 శాతం వరకు ఉన్నట్టు అంచనా. ఈ వర్గాలన్నీ ఒకే రాజకీయ పార్టీకి శాశ్వతంగా కట్టుబడి ఉండవు. వారి ఓటు నిర్ణయం స్థానిక అభ్యర్థి, కుల సమీకరణం, ప్రభుత్వ పనితీరు, ఉద్యోగాలు, సంక్షేమ పథకాలు, హిందుత్వ భావన, స్థానిక సమస్యలు వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. గత దశాబ్దంలో బీజేపీకి బలమైన సామాజిక కూటమిని నిర్మించిన యాదవేతర ఓబీసీ వర్గాల్లో స్వల్ప అసంతృప్తి కూడా పార్టీకి పెద్ద ఎన్నికల నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. 2024 ఎన్నికలు ఈ విషయాన్ని ఇప్పటికే చూపించాయి. అదే సమయంలో ఆ అసంతృప్తి శాశ్వతంగా ప్రతిపక్షానికి బదిలీ అయిందని చెప్పడానికి కూడా ఇంకా ఆధారాలు లేవు. బీజేపీ తన సామాజిక సమీ కరణాన్ని మార్చు కుంటూ, కొత్త ఓబీసీ నాయక త్వాన్ని ముందుకు తెస్తోంది. సమాజ్‌వాదీ పార్టీ పిడిఏ ఫార్ములాతో తన సంప్రదాయ యాదవ్ ఓటు పరిధిని దాటి విస్తరించాలని చూస్తోంది. కాంగ్రెస్ కులగణన, రిజర్వేషన్ల అంశాలతో ఓబీసీ వర్గాల్లో తన స్థానం పెంచుకోవాలని ప్రయత్నిస్తోంది. ఈ మూడు వ్యూహాలు ఢీకొనే వేదికగా యూపీ మారనుంది. బీజేపీ తన పాత ఓబీసీ కూటమిని తిరిగి బలపరచగలదా? అఖిలేష్ పిడిఏను మరింత విస్తరించగలరా? కాంగ్రెస్ కులగణన అంశాన్ని ఓట్లుగా మార్చగలదా? ఈ ప్రశ్నలకు వచ్చే అసెంబ్లీ ఎన్నికలే సమాధానం ఇవ్వనున్నాయి. ఒక విషయం మాత్రం స్పష్టం. 2024 తర్వాత యూపీలో ఓబీసీ రాజకీయాలు మళ్లీ పాత స్థితిలో లేవు. చిన్న చిన్న సామాజిక వర్గాల ఓటు మార్పులు కూడా సీట్ల లెక్కను పూర్తిగా మార్చగల స్థితిలో ఉన్నాయి. అందుకే లక్నోలో అధికారం కోసం జరుగుతున్న పోరులో అసలు గేమ్ ఓబీసీ ఓటు చుట్టూనే తిరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

### • అసలేం జరగబోతుంది యూపీలో?

ఉత్తరప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ ఎన్నికలు కేవలం అధికార మార్పు కోసం జరిగే సాధారణ పోరు కాదు.. ఓబీసీ ఓటు ఎవరి వైపు నిలుస్తుందన్నది మొత్తం ఫలితాలను నిర్ణయించే కీలక అంశంగా మారుతోంది. 2014, 2019లో బీజేపీకి బలమైన మద్దతుగా నిలిచిన యాదవేతర ఓబీసీ వర్గాల్లో 2024లో కొంత మార్పు కనిపించింది. అదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీ పిడిఏ ఫార్ములాతో యాదవేతర ఓబీసీలు, దళితులు, అల్పసంఖ్యాకులను కలిపే ప్రయత్నం చేస్తోంది. కాంగ్రెస్ కులగణన, రిజర్వేషన్లు, జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం వంటి అంశాలను ప్రధాన రాజకీయ ఆయుధాలుగా మలుస్తోంది. కానీ 2024 ఫలితాలను, అసెంబ్లీ ఎన్నికలకు వర్తింపజేయడం కూడా ప్రమాదకరమే. బీజేపీ తన ఓబీసీ బేస్‌లో ఏర్పడిన అసంతృప్తిని గుర్తించి కుర్మీ వంటి ప్రభావశీల వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోంది. అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమీకరణాలను మరింత జాగ్రత్తగా లెక్కించే అవకాశం ఉంది. మరోవైపు ఉద్యోగాలు, పోటీ పరీక్షలు, పేపర్ లీక్‌ల వంటి అంశాలు యువ ఓటర్లను ప్రభావితం చేస్తే సమీకరణం మరింత మారొచ్చు. యూపీలో ఓబీసీ వర్గాలు ఏకపక్ష ఓటు బ్యాంకు కావు. స్థానిక అభ్యర్థి, ప్రభుత్వ పనితీరు, సంక్షేమం, హిందుత్వం, ఉద్యోగాలు, కులగణన.. ప్రతి అంశం ఓటును ప్రభావితం చేయొచ్చు. అందుకే వచ్చే ఎన్నికల్లో బీజేపీ తన పాత ఓబీసీ కూటమిని నిలబెట్టుకుంటుందా, అఖిలేష్ పిడిఏను విస్తరిస్తారా, కాంగ్రెస్ కులగణన అంశాన్ని ఓట్లుగా మార్చగలదా అన్నదే అసలు పోరు. యూపీలో గెలిచేది కేవలం ఎక్కువ ఓట్లు తెచ్చుకున్న పార్టీ కాదు.. ఓబీసీ సామాజిక సమీకరణాన్ని చివరి వరకు తనవైపు నిలబెట్టుకున్న పార్టీయే కావచ్చు.



ఉత్తరప్రదేశ్ 2017 నుంచి బీజేపీకి బలమైన కోటగా ఉంది. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తనదైన పాలనా శైలితో, కరిష్మాతో రాష్ట్రంలో బలమైన నాయకుడిగా ఎదిగారు. అయితే 2024 లోక్‌సభ ఎన్నికల్లో యూపీలో బీజేపీకి ఎదురైన గట్టి దెబ్బ వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు కీలక పరీక్షగా మారింది. గతంలో బీజేపీకి అండగా నిలిచిన కొన్ని ఓబీసీ వర్గాల్లో మద్దతు కొంత తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కుల రాజకీయాలు బలపడుతున్నా, ఎన్నికల ఫలితాలను నిర్ణయించే అసలు అంశం కేవలం కుల సమీకరణాలు మాత్రమే కాదన్నది గమనించాలి. ధరల పెరుగుదల, ఆదాయం తగ్గడం, ఉపాధి అవకాశాలు, ఆర్థిక వ్యవస్థపై ప్రజల్లో ఉన్న అసంతృప్తి మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కుల సమీకరణాలతో ప్రతిపక్ష కూటములు చేసిన ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ఫలించకపోవడం కూడా దీనికి ఉదాహరణగా చూడొచ్చు. అందుకే వచ్చే ఆరు, ఏడు నెలల్లో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను ఎంతవరకు మెరుగుపరుస్తుంది, ధరలను ఎంతవరకు నియంత్రిస్తుంది, ఉపాధి అవకాశాలు పెంచుతుందా, ప్రజల ఆదాయాలను పెంచగలదా అన్నదే అసలు పరీక్ష. కులం ఆధారంగా ఒకటి, రెండు శాతం ఓటు మారవచ్చు.. కానీ ఆర్థిక వ్యవస్థ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొస్తే ఆ ప్రభావం మరింత పెద్దదిగా ఉంటుంది. ఉత్తరప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీకి అసలైన పరీక్ష కుల సమీకరణాల కంటే ఆర్థిక పనితీరుపైనే ఉంటుంది.

– **డాక్టర్ పెంటపాటి పుల్లారావు,**
**ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు**





# బడ్జెట్ ఫోన్.. గోల్డెన్ ఛాన్స్ గాన్

## ఫోన్ కొనాలా.. వెయిట్ చేయాలా?

కంపెనీల లాభాల వేట.. సర్కార్ ట్యాక్స్ ఆట • ఆండ్రాయిడ్ జేబీలతో కొత్త ఫిట్టింగ్

• అదనపు ధరలతో జేబులు కట్టింగ్ • స్మార్ట్ మొబైల్.. గుండె గుభేల్

ఒకప్పుడు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల మధ్యలోనే మంచి ఫోన్ దొరికేది. రూ. 20 వేల లోపు ఫోన్ అంటే దాదాపు అన్ని అవసరాలు తీర్చుకునే అవకాశం ఉండేది. మంచి కెమెరా, పెద్ద బ్యాటరీ, 5జీ, తగినంత ర్యామ్, స్టోరేజ్‌తో కూడిన ఫోన్లు సామాన్యుడి బడ్జెట్‌లోనే లభించేవి. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బడ్జెట్ ఫోన్ కొనాలంటేనే రూ. 20 వేల నుంచి రూ. 25 వేల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. గతంలో రూ. 18 వేల నుంచి రూ. 20 వేల మధ్యలో ఉన్న కొన్ని మోడళ్ల ధరలు ఇప్పుడు దాదాపు రూ. 25 వేల దగ్గరకు చేరాయి. కొన్ని మోడళ్ల ధరలు రూ. 1,000 నుంచి రూ. 3,500 వరకు పెరిగాయి. కొన్ని సందర్భాల్లో ధరల పెరుగుదల 40 శాతం వరకు వెళ్లింది. సాంసంగ్, వివో, ఒప్పో, రియల్‌మీ, షియామీ (రెడ్మీ), నథింగ్ వంటి ప్రముఖ కంపెనీల ఫోన్లలో ఈ ప్రభావం కనిపిస్తోంది. సామాన్యుడి అసలు ప్రశ్న ఇప్పుడు ఒక్కటే... కొత్త ఫోన్ కొనాలా? లేక ఉన్న ఫోన్‌నే మరికొంత కాలం వాడాలా? ధరలు పెరగడంతో చాలామంది పాత ఫోన్లకు రిపేర్లు చేయించుకుని వాడుతున్నారు. కొత్త ఫోన్ కొనుగోలు నిర్ణయాన్ని వాయిదా వేస్తున్నారు. 2026 ప్రారంభ నెలల్లోనే స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లు ఏడాది ప్రాతిపదికన దాదాపు 9 శాతం తగ్గినట్లు అమ్మకాల గణాంకాలు సూచిస్తున్నాయి. ఏప్రిల్ జూన్ త్రైమాసికంలో భారత స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్లు 11.1 శాతం తగ్గి 3.32 కోట్ల యూనిట్లకు చేరాయి. మరోవైపు మార్కెట్ విలువ మాత్రం పెరిగింది. అంటే ఫోన్లు తక్కువగా అమ్ముడవుతున్నా, ఖరీదైన ఫోన్ల వాటా పెరుగుతోంది. ఇదే సామాన్యుడికి సమస్యగా మారింది. ఫోన్ ఇప్పుడు విలాస వస్తువు కాదు. విద్య, ఉద్యోగం, బ్యాంకింగ్, ప్రభుత్వ సేవలు, డిజిటల్ చెల్లింపులు, సమాచార వినియోగం వంటి ప్రతి అవసరానికీ ఫోన్ తప్పనిసరిగా మారింది. అలాంటి సమయంలో సాధారణ కుటుంబం ప్రతి రెండుమూడేళ్లకు రూ. 25 వేల ఫోన్ కొనడం ఎంతవరకు సాధ్యం అన్న ప్రశ్న ముందుకు వస్తోంది.

### చిన్న ఫోన్ ఎందుకు ఇంత ఖరీదు?

స్మార్ట్‌ఫోన్ ధర పెరగడానికి ప్రధాన కారణాల్లో ఒకటి మనకు కనిపించని మెమరీ చిప్‌ల ఖర్చు. ప్రతి ఫోన్‌లో ఉపయోగించే DRAM, NAND మెమరీ చిప్‌ల ధరలు భారీగా పెరగడం తయారీ సంస్థలపై ఒత్తిడి పెంచుతోంది. ఈ పరిణామానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో వచ్చిన విపరీతమైన డిమాండ్ ప్రధాన కారణంగా మారింది. AI డేటా సెంటర్లలో ఉపయోగించే High Bandwidth Memory అంటే HBM చిప్‌లకు భారీ డిమాండ్ వచ్చింది. Nvidia వంటి సంస్థల డేటా సెంటర్ల కోసం పెద్ద మొత్తంలో అధునాతన మెమరీ అవసరం అవుతోంది. దీంతో సాంసంగ్ ఎలక్ట్రానిక్స్, మైక్రాన్ టెక్నాలజీ, ఎస్కే హింక్స్ వంటి మెమరీ తయారీ సంస్థలు అధిక లాభాలు వచ్చే HBM ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెడుతున్నాయి. ఫలితంగా సాధారణ స్మార్ట్‌ఫోన్లలో ఉపయోగించే మెమరీ చిప్‌ల సరఫరా కొంత తగ్గింది. DRAM, NAND ధరలు కొన్ని సందర్భాల్లో 50 నుంచి 60 శాతం వరకు పెరిగాయి. పరిశ్రమలో దీనిని కొందరు "AI Tax"గా అభివర్ణిస్తున్నారు. అంటే AI అభివృద్ధి వల్ల డేటా సెంటర్లకు అవసరమైన చిప్‌ల డిమాండ్ పెరగడం చివరికి సామాన్యుడు కొనుగోలు చేసే ఫోన్ ధరపైనా ప్రభావం చూపుతోంది. మెమరీ మాత్రమే కాదు. ప్రాసెసర్లు, డిస్‌ప్లేలు, కెమెరా సెన్సర్లు, బ్యాటరీలు, కనెక్టివిటీ పరికరాలు, తయారీ ఖర్చులు కూడా ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఫోన్లలో 5జీ, AI ఫీచర్లు, వేగవంతమైన ఛార్జింగ్, అధిక రిఫ్రెష్ రేట్ డిస్‌ప్లేలు, మెరుగైన కెమెరాలు, పెద్ద బ్యాటరీలు సాధారణ ఫీచర్లుగా మారాయి. ఇవన్నీ వినియోగదారుడికి సౌకర్యం ఇచ్చినా తయారీ ఖర్చును పెంచుతున్నాయి. దిగుమతి అయ్యే కీలక భాగాల ధరపై రూపాయి మారకం విలువ ప్రభావం కూడా ఉంటుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా రవాణా ఖర్చులు పెరిగితే అదనపు భారం కూడా ఫోన్ ధరలో చేరుతుంది. మెమరీ ఖర్చు పెరిగింది.. చిప్ సరఫరా తగ్గింది.. రవాణా ఖర్చు పెరిగింది.. తయారీ ఖర్చు పెరిగింది. చివరకు ఆ భారమంతా వినియోగదారుడి బిల్లుపై పడుతోంది.

### • లాభాలు తగ్గించుకోలేరా కంపెనీలు?

ఇక్కడే సామాన్యుడి ఆవేదన మొదలవుతోంది. కంపెనీలు ధరలు పెంచుతున్నాయి. కారణాలుగా చిప్ ధరలు, సరఫరా సమస్యలు, తయారీ ఖర్చులు చెబుతున్నాయి. కానీ ఇన్నాళ్లూ భారీగా అమ్మకాలు జరిపి లాభాలు సంపాదించిన కంపెనీలు కొంత భారం తామే భరించలేవా అన్న ప్రశ్న వినిపిస్తోంది. ముఖ్యంగా రూ.10 వేల నుంచి రూ.25 వేల మధ్య ఫోన్లు కొనేవారు భారీ సంఖ్యలో ఉన్నారు. ఈ వర్గం కంపెనీలకు అత్యంత కీలకం. అయినప్పటికీ బడ్జెట్ విభాగంలో కంపెనీల లాభ మార్జిన్లు తగ్గుతున్నాయన్న కారణంతో ధరలను పైకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోంది. తయారీ సంస్థలకు మూడు మార్గాలే కనిపిస్తున్నాయి. ధర పెంచడం, అదే ధరలో RAM లేదా స్టోరేజ్ తగ్గించడం, లేక తక్కువ లాభంతో ఫోన్ విక్రయించడం. ప్రస్తుతం చాలా కంపెనీలు మొదటి మార్గాన్నే ఎంచుకుంటున్నాయి. కొన్ని బ్రాండ్లలో ధరల పెరుగుదల గణనీయంగా నమోదైంది. షియామీలో 32 శాతం, సాంసంగ్‌లో 36 శాతం, వివోలో 40 శాతం, ఒప్పోలో 41 శాతం, రియల్‌మీలో 53 శాతం వరకు ధర పెరుగుదల నమోదైన మోడళ్ల గురించి మార్కెట్ నివేదికలు పేర్కొంటున్నాయి. ఇది ప్రతి మోడల్ ధర అంతే శాతంలో పెరిగిందని అర్థం కాదు. కానీ ధరల పెరుగుదల ఎంత తీవ్రమైన స్థాయికి చేరిందో ఈ గణాంకాలు సూచిస్తున్నాయి. మరోవైపు ప్రీమియం ఫోన్ కొనుగోలుదారులపై ప్రభావం కొంత తక్కువగా ఉండవచ్చు. అధిక ధరల ఫోన్ కొనేవారికి ధర కంటే బ్రాండ్, కెమెరా, డిజైన్, పనితీరు వంటి అంశాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. పెద్ద కంపెనీలకు సరఫరా వ్యవస్థపై కూడా మెరుగైన నియంత్రణ ఉంటుంది. అసలు దెబ్బ మాత్రం మధ్యతరగతి, తక్కువ ఆదాయ వర్గాలకే పడుతోంది. సామాన్యుడి బడ్జెట్ పెరగడం లేదు.. ఫోన్ ధర మాత్రం పెరుగుతోంది. అందుకే కంపెనీలు కొంతకాలం లాభాలను తగ్గించుకుని వినియోగదారుడికి ఉపశమనం కల్పించాలన్న డిమాండ్ బలపడుతోంది. ఒక ఫోన్ తయారీలో మార్జిన్ తగ్గించడం కంపెనీకి తాత్కాలిక నష్టం కావచ్చు. కానీ అదే నిర్ణయం లక్షలాది కుటుంబాలకు ఫోన్ కొనుగోలు భారాన్ని తగ్గించవచ్చు. మార్కెట్ పడిపోతున్న సమయంలో వినియోగదారుడిని నిలబెట్టుకోవడం కంపెనీల దీర్ఘకాల ప్రయోజనానికీ ఉపయోగపడుతుంది.

### • పన్నుల భారాన్ని తగ్గిస్తే ఉపశమనం కాదా?

ఇప్పుడు ప్రభుత్వాల పాత్రపైనా ప్రశ్నలు వస్తున్నాయి. ఫోన్ సామాన్యుడి జీవితంలో అత్యవసర సాధనంగా మారినప్పుడు దానిపై ఉన్న పన్నులు, దిగుమతి భారాలు, ఇతర వ్యయాలను తగ్గించే అవకాశం ప్రభుత్వాలకు లేదా అన్న చర్చ మొదలైంది. ప్రభుత్వం నేరుగా ప్రతి ఫోన్ ధరను నిర్ణయించదు. కానీ పన్ను విధానం, తయారీ ప్రోత్సాహకాలు, దిగుమతి విధానాలు, దేశీయ తయారీకి ఇచ్చే సహకారం ద్వారా ధరలపై ప్రభావం చూపగలదు. బడ్జెట్ ఫోన్లపై పన్ను భారాన్ని తగ్గిస్తే సామాన్యుడికి నేరుగా ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. దేశంలోనే ఎక్కువ భాగం తయారీ జరిగినా కీలక భాగాల్లో కొన్నింటికి దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. అందువల్ల దేశీయంగా భాగాల తయారీ పెరగాలి. ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాలు కేవలం కంపెనీలకు లాభం కలిగించడానికే కాకుండా చివరికి వినియోగదారుడి ధర తగ్గేలా ఉండాలి. ప్రస్తుతం కొత్త భారతీయ బ్రాండ్లకు ఇదే పరిస్థితి అవకాశంగా మారుతోంది. ఫైర్ బోల్ట్, ఫిలిప్స్ వంటి సంస్థలు స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి అడుగుపెట్టాయి. ఫ్లిప్‌కార్ట్ ఓన్ బ్రాండ్లు తీసుకొస్తోంది. Mivi కూడా ఈ విభాగంలోకి రావడానికి సిద్ధమవుతోంది. రూ.20 వేల లోపు మార్కెట్‌లో పెద్ద కంపెనీలు కొంత వెనక్కి తగ్గుతున్న నేపథ్యంలో దేశీయ బ్రాండ్లకు స్థలం ఏర్పడుతోంది. మార్కెట్ పరిశోధకుల అంచనాల ప్రకారం రూ.20 వేల నుంచి రూ.25 వేల లోపు విభాగంలో గణనీయమైన ఖాళీ ఏర్పడింది. భారతదేశానికి ఇంకా దాదాపు 4 కోట్ల ఎంట్రీ లెవల్ 4జీ ఫోన్ల అవసరం ఉందని పరిశ్రమ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ డిమాండ్‌లో కొంత భాగాన్ని తక్కువ ధరలో 5జీ ఫోన్లు కూడా తీర్చగలవు. Lava వంటి దేశీయ సంస్థలు రూ.30 వేల లోపు విభాగంపై దృష్టి పెడుతున్నాయి. స్థానిక తయారీ, పరిశోధన, డిజైన్ సామర్థ్యాలు ఖర్చును నియంత్రించడంలో సహాయపడవచ్చు. ప్రభుత్వం కొత్త MPMS పథకం ద్వారా దేశీయ సంస్థలకు అదనపు ప్రయోజనం కల్పిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. అయితే పన్ను తగ్గింపు ఒక్కటే పరిష్కారం కాదు. దేశీయ చిప్, డిస్‌ప్లే, కెమెరా, పీసీబీ, ఇతర భాగాల తయారీ పెరిగితేనే దీర్ఘకాలంలో ధరలపై స్థిరమైన ప్రభావం ఉంటుంది.

### • 8GB RAM.. 256GB స్టోరేజ్ సామాన్యుడికి ఎందుకు భారమవుతోంది?

ఇక్కడ మరో కీలక సమస్య ఉంది. వినియోగదారుడి అవసరాలు పెరిగాయి. యాప్‌లు పెరిగాయి. ఫోటోలు, వీడియోలు, సోషల్ మీడియా, ఆన్‌లైన్ తరగతులు, డిజిటల్ చెల్లింపులు, బ్యాంకింగ్ యాప్‌లు, ప్రభుత్వ సేవలు అన్నీ ఫోన్‌లోనే జరుగుతున్నాయి. ఫలితంగా కనీసం 8GB RAM, 256GB స్టోరేజ్ ఉన్న ఫోన్ కావాలన్న భావన బలపడుతోంది. 4GB లేదా 6GB RAM ఉన్న ఫోన్ కొంటే కొంతకాలం తర్వాత పనితీరు తగ్గుతుందనే భయం వినియోగదారుల్లో ఉంది. 128GB స్టోరేజ్ కూడా కొందరికి సరిపోవడం లేదు. అందుకే 8GB RAM, 256GB స్టోరేజ్ మోడళ్ల వైపు డిమాండ్ పెరుగుతోంది. సమస్య ఏమిటంటే ఈ కాంబినేషన్ ఉన్న మంచి ఫోన్ ధర చాలా సందర్భాల్లో రూ.25 వేల దగ్గరికి చేరుతోంది. సామాన్య కుటుంబానికి ఇది చిన్న మొత్తం కాదు. నెల జీతంలో నుంచి ఇల్లు అద్దె, పిల్లల చదువు, విద్యుత్, ప్రయాణం, వైద్యం, సరుకులు, ఇతర ఖర్చులు తీసేసిన తర్వాత ఫోన్ కోసం రూ.25 వేలు కేటాయించడం కష్టమే. EMI ద్వారా కొనుగోలు చేయడం మరో మార్గంగా మారుతోంది. భారతదేశంలోని Tier2 మార్కెట్లలో రెండో త్రైమాసికంలో స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లలో EMI వాటా 57.5 శాతానికి చేరింది. ఏడాది క్రితం ఇది 44 శాతం మాత్రమే. అంటే ధర పెరిగిన కొద్దీ ప్రజలు ఫోన్ కొనడం మానేయడం మాత్రమే కాదు.. అప్పుగా కొనడం కూడా పెరుగుతోంది. ఇది వినియోగదారుడికి తక్షణ పరిష్కారం ఇవ్వొచ్చు. కానీ దీర్ఘకాలంలో కుటుంబ బడ్జెట్‌పై అదనపు భారం అవుతుంది. మరోవైపు కంపెనీలు తక్కువ ధరను చూపించేందుకు RAM లేదా స్టోరేజ్‌ను తగ్గిస్తే వినియోగదారుడు భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజీ పడాల్సి వస్తుంది. అందుకే కంపెనీలు రూ.15 వేల నుంచి రూ.20 వేల మధ్యలో నిజంగా ఉపయోగపడే 8GB RAM, తగినంత స్టోరేజ్, మంచి బ్యాటరీ, నమ్మదగిన సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లతో ఫోన్లు అందించాలి అన్న డిమాండ్ పెరుగుతోంది. ఇది కేవలం తక్కువ ధర విషయం కాదు. ఇది డిజిటల్ సమానత్వానికి సంబంధించిన అంశం. ధనికుడికి అధిక ధర ఫోన్ అందుబాటులో ఉంటుంది. సామాన్యుడికి మాత్రం అవసరమైన పనులు చేసుకునేందుకు సరైన ఫోన్ కూడా భారంగా మారకూడదు.

### ముఖ్యమైన గణాంకాలు & మార్కెట్ మార్పులు

**అంశం/ప్రస్తుత పరిస్థితి / గణాంకాలు**

**భారత స్మార్ట్‌ఫోన్ షిప్‌మెంట్ల తగ్గుదల**
ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో 11.1% తగ్గి 3.32 కోట్ల యూనిట్లకు చేరాయి

**ధరల పెరుగుదల ప్రభావం**
వివో, ఒప్పో, రియల్‌మీ వంటి మోడళ్లలో గరిష్టంగా 40% నుంచి 53% వరకు పెరిగిన ధరలు

**Tier-2 నగరాల్లో EMI వాటా**
స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లలో EMI వాటా 44% నుంచి 57.5% కి పెంపు

**ఎంట్రీ లెవెల్ 4G ఫోన్ల డిమాండ్**
దేశంలో ఇంకా దాదాపు 4 కోట్ల చౌక ఫోన్ల అవసరం ఉందని అంచనా

### వినియోగదారుడి ముందు ఉన్న 4 ప్రధాన మార్గాలు

**ప్రస్తుత ఫోన్‌ను కొనసాగించడం:**
ఫోన్ సరిగ్గా పనిచేస్తుంటే బ్యాటరీ మార్చడం లేదా డేటా ఖాళీ చేయడం ద్వారా మరికొంత కాలం వాడుకోవడం.

**భారతీయ బ్రాండ్ల వైపు చూడటం:**
రూ.20 వేల లోపు విభాగంలోకి వస్తున్న Lava, FireBoltt వంటి స్వదేశీ బ్రాండ్లను పరిశీలించడం.

**రిఫర్బిష్డ్ / సెకండ్ హ్యాండ్ ఫోన్లు:**
తక్కువ ధరలో మంచి కాన్ఫిగరేషన్ కోసం వాడిన ఫోన్లను కొనుగోలు చేయడం.

**బడ్జెట్ పెంచుకుని ప్రముఖ బ్రాండ్ కొనడం:**
భద్రతా అప్‌డేట్లు, సాఫ్ట్‌వేర్ సపోర్ట్ ప్రాధాన్యమైతే EMI లేదా సేవింగ్స్ ద్వారా కొత్త ఫోన్ తీసుకోవడం.



### • ప్రపంచం ఏం చేసినా.. సామాన్యుడికి ఫోన్ కావాలి!




AI ప్రపంచం వేగంగా ఎదగాలి. డేటా సెంటర్లు పెరగాలి. అధునాతన చిప్‌ల తయారీ పెరగాలి. సాంకేతికత అభివృద్ధి చెందాలి. ఇవన్నీ అవసరమే. కానీ ప్రపంచ సాంకేతిక పోటీకి సంబంధించిన ఖర్చు మొత్తం సామాన్యుడి ఫోన్ బిల్లుపై పడకూడదు అన్నదే అసలు ప్రశ్న. ఒకవైపు అనేక వస్తువుల ధరలు పోటీ, ఉత్పత్తి సామర్థ్యం, కొత్త కంపెనీల ప్రవేశం వల్ల తగ్గుతున్నాయి. మరోవైపు స్మార్ట్‌ఫోన్ ధర మాత్రం పెరుగుతోంది. అందుకే వినియోగదారుడి సందేహం సహజమే. "ప్రపంచంలో టెక్నాలజీ చౌక అవుతున్న కాలంలో నా ఫోన్ ఎందుకు ఖరీదవుతోంది?" ప్రస్తుతం కొనుగోలుదారుడి ముందు నాలుగు మార్గాలు కనిపిస్తున్నాయి. ధర ఎక్కువైనా ప్రముఖ బ్రాండ్ కొనడం, ఉన్న ఫోన్‌ను మరికొంతకాలం వాడడం, సెకండ్ హ్యాండ్ ఫోన్ తీసుకోవడం, తక్కువ ధరలో కొత్త భారతీయ బ్రాండ్‌ను ప్రయత్నించడం. ఇందులో ఏది సరైనదో వ్యక్తిగత అవసరంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుత ఫోన్ సరిగ్గా పనిచేస్తుంటే వెంటనే కొత్తది కొనాల్సిన అవసరం లేదు. బ్యాటరీ మార్చడం, స్టోరేజ్ నిర్వహించడం, అవసరం లేని యాప్‌లు తొలగించడం ద్వారా మరికొంతకాలం వాడుకోవచ్చు. కానీ ఫోన్ భద్రతా అప్‌డేట్లు ఆగిపోయి ఉంటే, బ్యాటరీ పూర్తిగా బలహీనపడితే, పనితీరు తీవ్రంగా పడిపోతే కొత్త ఫోన్ అవసరం అవుతుంది. ఇలాంటి సమయంలో కేవలం బ్రాండ్ పేరు కాకుండా RAM, స్టోరేజ్, ప్రాసెసర్, బ్యాటరీ, సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు, సర్వీస్ నెట్‌వర్క్, వారంటీ, రిపేర్ ఖర్చు వంటి అంశాలను పరిశీలించాలి. భారతీయ బ్రాండ్లకు ఇది మంచి అవకాశం. కానీ తక్కువ ధరతో మొదటి ఫోన్ అమ్మడం సరిపోదు. కస్టమర్‌కు నాణ్యత, సాఫ్ట్‌వేర్ సపోర్ట్, సర్వీస్, నమ్మకం ఇవ్వాలి. పరిశ్రమ నిపుణుల ప్రకారం ప్రస్తుతం ఏర్పడిన ఈ అవకాశం శాశ్వతం కాకపోవచ్చు. ఒకటి నుంచి ఏడాదిన్నర కాలం మాత్రమే బలంగా ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. కొత్త బ్రాండ్ల అసలు పరీక్ష మాత్రం మూడు నుంచి ఐదేళ్ల తర్వాత వస్తుంది. మొదటి ఫోన్ కొనుగోలు చేసిన కస్టమర్ మళ్లీ అదే బ్రాండ్ ఫోన్ కొనాలనిపించేలా చేయగలిగితేనే ఆ సంస్థ నిలబడుతుంది. కాబట్టి ఇప్పుడు సామాన్యుడి ముందు ఉన్న అసలు ప్రశ్న "ఏ ఫోన్ కొనాలి?" కాదు.. "ఇప్పుడే ఫోన్ కొనాల్సిన అవసరం ఉందా?" అన్నదే. అవసరం లేకపోతే వేచి చూడడం మంచిదే. అవసరం ఉంటే ధరతో పాటు భవిష్యత్ ఉపయోగాన్ని లెక్కలోకి తీసుకుని కొనాలి. ఫోన్ సామాన్యుడి జీవితంలో తప్పనిసరి వస్తువుగా మారినందున దాని ధర కూడా సామాన్యుడి ఆదాయానికి అందుబాటులో ఉండాల్సిందే. AIకి చిప్‌లు కావాలి.. కంపెనీలకు లాభాలు కావాలి.. ప్రభుత్వాలకు ఆదాయం కావాలి.. కానీ చివరికి ఫోన్ కొనేది సామాన్యుడే. అతని బడ్జెట్‌ను మరిచిపోతే స్మార్ట్‌ఫోన్ మార్కెట్ ఎంత అభివృద్ధి చెందినా అసలు వినియోగదారుడి దూరం మాత్రం పెరుగుతూనే ఉంటుంది.



- పక్కనున్నవారు కొట్టేశారు పల్టీ..
- జగన్‌కు వేస్తున్నారు పెనాల్టీ

రాజకీయాల్లో ప్రత్యర్థులు మారడం పెద్ద విషయం కాదు. అధికారంలో ఉన్న పార్టీని ప్రతిపక్షం విమర్శించడం కూడా కొత్త విషయం కాదు. కానీ ఒక నాయకుడి రాజకీయ ప్రస్థానం మొదలైనప్పటి నుంచి అతనితో కలిసి నడిచినవాళ్లు, పార్టీ నిర్మాణంలో భాగస్వాములైనవాళ్లు, ఎన్నికల్లో అతని జెండా మోసినవాళ్లు, అధికారంలోకి వచ్చిన తర్వాత పదవులు అనుభవించినవాళ్లు.. చివరకు అదే నాయకుడికి దూరమై, అదే నాయకత్వంపై తీవ్ర విమర్శలు చేయడం మాత్రం రాజకీయ పరిశీలకులకు ఎప్పటికీ ఆసక్తికరమైన అంశమే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే ఇలాంటి ఉదాహరణలు ఒకటో రెండో కాదు. విజయసాయిరెడ్డి నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి వరకు, రఘురామకృష్ణరాజు నుంచి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వరకు, ఆనం రామనారాయణరెడ్డి నుంచి ఆళ్ల రామకృష్ణారెడ్డి వరకు, చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి నుంచి మరికొందరు నేతల వరకు.. ఒక్కొక్కరి కథ ఒక్కోలా ఉన్నా, అందులో కనిపించే సామాన్యమైన రాజకీయ రేఖ మాత్రం ఒకటే.. దగ్గరగా ఉన్నప్పుడు ఒక మాట.. దూరమైన తర్వాత మరో మాట. ఇక్కడ ఎవరు నిజం చెప్పారు... ఎవరు రాజకీయ ప్రయోజనం కోసం మాట్లాడారన్నది ఒక్కొక్కరి సందర్భాన్ని బట్టి నిర్ణయించాల్సిందే. కానీ ఒక పార్టీ నుంచి పదేపదే కీలక వ్యక్తులు బయటకు వస్తుంటే, ప్రతి ఒక్కరినీ ద్రోహి అని కొట్టిపారేయడం కంటే ఆ పార్టీ నాయకత్వ వ్యవస్థలో ఏమి జరుగుతోందో పరిశీలించడం కూడా అవసరం. జగన్ రాజకీయ నిఘంటువులో 'విశ్వసనీయత'కు ప్రత్యేక స్థానం ఉంది. తనది మాట తప్పని, మడమ తిప్పని రాజకీయమని ఆయన తరచూ చెబుతారు. ప్రజలతో తన బంధం విశ్వాసంపై ఆధారపడి ఉందని చెబుతారు. తనను నమ్మిన ప్రజలను తాను నమ్ముతానని చెబుతారు. ఈ నినాదం ఎన్నికల రాజకీయాల్లో ఆయనకు బలమైన ఆయుధంగా కూడా పనిచేసింది. కానీ ఒక నాయకుడి విశ్వసనీయతను కేవలం ఎన్నికల సమయంలో ప్రజలు వేసే ఓటుతోనే కొలవలేం. ఆ నాయకుడి వెంట నడిచినవాళ్లు, ఆయన నిర్ణయాలను దగ్గరగా చూసినవాళ్లు, ఆయనతో అధికారాన్ని పంచుకున్నవాళ్లు, ఆయనతో విభేదించినవాళ్లు కూడా ఆ నాయకత్వానికి అద్దం పడతారు. ఆ అద్దంలో పగుళ్లు కనిపిస్తే.. అద్దాన్నే పగలగొట్టారని చెప్పడం సులభం. కానీ పగుళ్లు ఎందుకు వచ్చాయో తెలుసుకోవడం నాయకత్వ బాధ్యత.

# కోవర్ట్‌లతో బీ అలర్ట్

## పాలిటిక్స్‌లో నో లాయల్టీ.. పవర్ పోయాక తెలిసొచ్చింది రియాల్టీ

### విజయసాయి వ్యవహారం చెప్పే అసలు కథ

విజయసాయిరెడ్డి ఉదాహరణ ఈ చర్చలో అత్యంత ముఖ్యమైనది. జగన్ రాజకీయ ప్రస్థానంలో అత్యంత సన్నిహితుడిగా కనిపించిన వ్యక్తి. పార్టీ అధికారంలోకి రాక ముందు, వచ్చిన తర్వాత ఢిల్లీలో వైసీపీ వ్యవహారాలను చూసిన కీలక నాయకుడు. రాజ్యసభ సభ్యుడు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి. జగన్ ఢిల్లీ రాజకీయాల్లో ఒక బలమైన ప్రతినిధి. అంటే ఆయన కేవలం పార్టీ నాయకుడు కాదు.. జగన్ రాజకీయ వ్యవస్థలో ఒక కీలక స్తంభం. అలాంటి వ్యక్తి రాజకీయాలకు దూరమవడం, ఆ తర్వాత జగన్ చుట్టూ ఉన్న వ్యవస్థపై విమర్శలు చేయడం.. సాధారణ పార్టీ మార్పు కింద చూడలేం. విజయసాయి తనకు జగన్‌తో సంబంధం దెబ్బతినడానికి కారణం జగన్ చుట్టూ ఏర్పడిన వర్గమేనని ఆరోపించారు. తనపై అనుమానాలు పెంచారని, తన ప్రాధాన్యం తగ్గిందని, నాయకుడిని కలవడానికి కూడా మధ్యలో ఉన్నవారిని దాటాల్సి వచ్చిందనే భావన కలిగిందని ఆయన చెప్పారు. ఈ ఆరోపణల్లో ఎంత వాస్తవం ఉందో సంబంధిత వ్యక్తులకే తెలుసు. కానీ రాజకీయంగా మాత్రం ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. జగన్‌కు అత్యంత దగ్గరగా ఉన్న వ్యక్తి కూడా ఒక దశలో 'నన్ను నమ్మడం లేదు' అనే స్థితికి చేరుకున్నాడు. ఇది కేవలం విజయసాయి సమస్యగా చూస్తే అసలు రాజకీయ ప్రశ్న తప్పిపోతుంది. ఎందుకంటే నాయకుడి దగ్గరికి ఎవరిని అనుమతించాలి. ఎవరిని నమ్మాలి. ఎవరిని దూరం పెట్టాలి అనే వ్యవస్థ మొత్తం చివరికి నాయకత్వం చేతుల్లోనే ఉంటుంది. ఇక్కడే 'కోటరీ' అనే పదం రాజకీయ చర్చలోకి వస్తుంది. ప్రతి నాయకుడికీ ఒక అంతర్గత వలయం ఉంటుంది. అది సహజం. కానీ ఆ వలయం నాయకుడికి సమాచారాన్ని అందించే వ్యవస్థగా ఉంటే మంచిదే. నాయకుడికి నచ్చని సమాచారాన్ని అడ్డుకునే గోడగా మారితే మాత్రం ప్రమాదం. నాయకుడికి నచ్చే మాటలే వినిపిస్తూ, అసమ్మతిని ఫిల్టర్ చేస్తూ, ప్రత్యామ్నాయ స్వరాలను నాయకుడి చెవులకు చేరకుండా చేస్తే.. కొంతకాలానికి నాయకుడికి బయట ప్రపంచం కనిపించదు. అప్పుడు నాయకుడి చుట్టూ ఉన్నవాళ్లు అతని రక్షకులా కనిపించినా.. వాస్తవానికి అతని రాజకీయ ఒంటరితనానికి కారణమవుతారు.

### రఘురామకృష్ణరాజు.. పార్టీలోనే ప్రశ్నగా మారిన ఎంపీ

రఘురామకృష్ణరాజు కథ మరింత నాటకీయమైనది. 2019లో వైసీపీ తరఫున నరసాపురం లోక్‌సభకు పోటీ చేసి గెలిచారు. అంటే జగన్ పార్టీ గుర్తుపై ప్రజల తీర్పుతో పార్లమెంటులోకి వెళ్లిన వ్యక్తి. కానీ కొద్ది కాలానికే ఆయన పార్టీ విధానాలపై బహిరంగంగా ప్రశ్నలు లేవనెత్తడం మొదలుపెట్టారు. ప్రభుత్వం తీసుకున్న కొన్ని నిర్ణయాలను ఆయన వ్యతిరేకించారు. పార్టీ నాయకత్వంతో విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. చివరకు ఆయన జగన్ ప్రభుత్వానికి అత్యంత గట్టిగా విమర్శలు చేసే వ్యక్తుల్లో ఒకరిగా మారారు. రఘురామ వ్యవహారంలో రాజకీయ విభేదం వ్యక్తిగత ఘర్షణ స్థాయికి చేరింది. ఆయనపై పార్టీ చర్యలు, ఆయన అరెస్టు, ఆ తర్వాత ప్రభుత్వంపై ఆయన చేసిన తీవ్రమైన ఆరోపణలు.. ఇవన్నీ కలిసి వైసీపీ ప్రభుత్వానికి పెద్ద రాజకీయ ఇబ్బందిగా మారాయి. ఆయన చేసిన ప్రతి ఆరోపణ నిజమేనని చెప్పడం సరైంది కాదు. అదే సమయంలో ఆయన చెప్పిన ప్రతి మాటను కేవలం రాజకీయ కుట్రగా కొట్టిపారేయడం కూడా రాజకీయ విశ్లేషణ కాదు. ఎందుకంటే ఆయన ఒకప్పుడు అదే పార్టీ ఎంపీ. ఆయనకు పార్టీ అంతర్గత వ్యవస్థ ఎలా పనిచేస్తుందో ప్రత్యక్ష అనుభవం ఉంది. ఇక్కడ జగన్ నాయకత్వానికి ఎదురయ్యే ప్రశ్న.. ఒక ఎంపీ తన పార్టీకి వ్యతిరేకంగా బహిరంగంగా మాట్లాడేంత దూరం ఎందుకు వెళ్లాడు? అతన్ని మొదట్లోనే ఎందుకు సమన్వయం చేయలేకపోయారు? విభేదం ఏర్పడినప్పుడు చర్చ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఎందుకు నిలబడలేదు? పార్టీ క్రమశిక్షణ అవసరమే. కానీ క్రమశిక్షణకు ముందు రాజకీయ సంభాషణ అవసరం. ఒక నాయకుడు తనతో విభేదించిన వ్యక్తిని వెంటనే శత్రువుగా చూస్తే.. ఆ వ్యక్తి బయటకు వెళ్లిన తర్వాత శత్రువుగా మారే అవకాశం మరింత పెరుగుతుంది.

### ఆదినారాయణరెడ్డి.. జమ్మలమడుగు నుంచి జగన్ వ్యతిరేక స్వరం

కడప రాజకీయాలను పక్కనపెట్టి జగన్ రాజకీయ కథ చెప్పడం అసాధ్యం. అదే కడప జిల్లాలో జగన్ రాజకీయ ఆధిపత్యానికి ఎదురుగా నిలిచిన ప్రముఖ నాయకుల్లో చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఒకరు. వైసీపీ తరఫున 2014లో జమ్మలమడుగు ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన తర్వాత జగన్ పార్టీని వీడి టీడీపీలో చేరారు. చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. అనంతరం బీజేపీలో చేరారు. ఇలా రాజకీయ ప్రయాణం అనేక మలుపులు తిరిగింది. ఆదినారాయణరెడ్డి విషయంలో రాజకీయ సమీకరణాలు, స్థానిక ఆధిపత్య పోరు, పార్టీ మార్పులు అన్నీ కలిసి ఉన్నాయి. అయితే ఒకప్పుడు జగన్ పార్టీ గుర్తుపై గెలిచిన వ్యక్తి తర్వాత జగన్ రాజకీయ విధానాలను, పాలనను తీవ్రంగా విమర్శించడం మాత్రం వైసీపీకి అసౌకర్యకరమైన అంశమే. ప్రత్యర్థి పార్టీలో ఉన్నప్పుడు విమర్శించడం సహజం. కానీ ఒకప్పుడు అదే పార్టీ అభ్యర్థిగా ప్రజల ముందుకు వెళ్లిన నాయకుడు తర్వాత ఆ పార్టీ నాయకత్వాన్నే తీవ్రంగా తప్పుబట్టడం.. నాయకత్వ సంబంధాలపై ప్రశ్నలు రేపుతుంది. కడప లాంటి ప్రాంతంలో ఇది మరింత ప్రాధాన్యమైనది. ఎందుకంటే జగన్ రాజకీయ బలం కేవలం పార్టీ నిర్మాణం కాదు. కుటుంబ వారసత్వం, వ్యక్తిగత ప్రభావం, స్థానిక నేతల నెట్‌వర్క్, సామాజిక సమీకరణాలు... ఇవన్నీ కలిసి ఏర్పడిన వ్యవస్థ. అలాంటి వ్యవస్థలో ఒక కీలక నాయకుడు బయటకు వెళ్లడం అంటే కేవలం ఒక వ్యక్తి పార్టీ మారడం కాదు. స్థానిక రాజకీయ సమీకరణంలో ఒక చీలిక ఏర్పడటం.

### బాలినేని.. పదవి పోయిన తర్వాత బయటపడిన అసంతృప్తి

బాలినేని శ్రీనివాసరెడ్డి విషయంలో బంధుత్వం, రాజకీయ అనుబంధం రెండూ ఉన్నాయి. వైఎస్ కుటుంబానికి సన్నిహితంగా ఉన్న ఆయన జగన్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీలో ఆయనకు ప్రాధాన్యం ఉంది. కానీ 2022లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో పదవి పోయిన తర్వాత ఆయన అసంతృప్తి బహిర్గతమైంది. ఒంగోలు రాజకీయాల్లో తనకు తగిన ప్రాధాన్యం లేదన్న భావన, స్థానిక నేతలతో విభేదాలు, పార్టీ వ్యవహారాల్లో తాను అనుకున్న స్థాయిలో పాత్ర లేకపోవడం వంటి అంశాలు ఆయన వైదొలగడానికి దారితీశాయి. చివరకు జనసేనలో చేరారు. ఇక్కడ ఒక రాజకీయ మానసిక శాస్త్రం పనిచేస్తుంది. అధికారం ఉన్నప్పుడు నాయకుడి చుట్టూ ఉండే సంబంధాలు చాలా వరకు అధికారంతో ముడిపడి ఉంటాయి. పదవి ఉన్నప్పుడు ఫోన్ చేసే వాళ్లు ఎక్కువ. పదవి పోయినప్పుడు ఫోన్ చేసే వాళ్లు తగ్గుతారు. పదవి ఉన్నప్పుడు మాటకు బరువు ఉంటుంది. పదవి పోయినప్పుడు అదే మాటకు బరువు తగ్గుతుంది. అప్పుడు అసలు సంబంధం బయటపడుతుంది. బాలినేని విషయంలో ఇదే జరిగిందా? లేక పార్టీలో ఆయనకు సంబంధించిన రాజకీయ సమీకరణాలు మారాయా? ఏది నిజమైనా.. ఒక విషయం మాత్రం స్పష్టం... నాయకుడితో ఉన్న అనుబంధాన్ని కేవలం పదవితో కొలిస్తే.. పదవి పోయిన రోజే ఆ అనుబంధం కూడా పరీక్షకు వస్తుంది.

### నెల్లూరు కోటలో కోటంరెడ్డి.. నమ్మకం చీలినప్పుడు

కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వ్యవహారం 'నమ్మకం' అనే పదాన్ని మరో కోణంలో ముందుకు తెస్తుంది. వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయన పార్టీ నాయకత్వానికి దగ్గరగా ఉన్న వ్యక్తిగా కనిపించారు. కానీ తర్వాత విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేస్తోందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఆ ఆరోపణలను ఖండించింది. ఆ తర్వాత ఆయన టీడీపీలో చేరారు.



ఫోన్ ట్యాపింగ్ ఆరోపణ నిజమా కాదా అన్నది చట్టపరమైన, దర్యాప్తు అంశం. కానీ రాజకీయంగా ఆ ఆరోపణ బయటకు రావడమే ఒక పెద్ద సంకేతం. ఎందుకంటే నమ్మకం ఉన్న చోట అనుమానం పెరగదు. అనుమానం పెరిగిన చోట రాజకీయ బంధం ఎక్కువకాలం నిలబడదు. ఒక ఎమ్మెల్యే తన సొంత ప్రభుత్వంపైనే ఇలాంటి ఆరోపణ చేయడం అంటే సంబంధం ఎంతగా దెబ్బతిన్నదో అర్థం చేసుకోవచ్చు. ఆనం, ఆళ్ల.. ఒక్కొక్కరి కారణం ఒక్కోటి.. ఆనం రామనారాయణరెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి వంటి నేతల రాజకీయ ప్రయాణాలను కూడా ఇదే నేపథ్యంలో చూడాలి. అయితే ఇక్కడ ఒక జాగ్రత్త అవసరం. ప్రతి పార్టీ మార్పును జగన్ నాయకత్వ వైఫల్యంగా చిత్రీకరించడం ఎంత తప్పో, ప్రతి పార్టీ మారిన నాయకుడిని అవకాశవాదిగా కొట్టిపారేయడం కూడా అంతే తప్పు. రాజకీయాల్లో వ్యక్తిగత ప్రయోజనాలు, టికెట్ ఆశలు, స్థానిక విభేదాలు, కుల సమీకరణాలు, భవిష్యత్తు అవకాశాలు.. అన్నీ పనిచేస్తాయి. కాబట్టి ప్రతి నాయకుడి నిర్ణయానికి వేర్వేరు కారణాలు ఉంటాయి. కానీ నాయకత్వానికి ముఖ్యమైనది కారణాల వైవిధ్యం కాదు.. విడిపోవడాల పునరావృతం. ఒకసారి జరిగితే ప్రమాదం కాదు. పదేపదే జరిగితే వ్యవస్థను పరిశీలించాల్సిందే.

### షర్మిల అంశాన్ని ఎలా చూడాలి?

వైఎస్ షర్మిల విషయాన్ని ఈ విశ్లేషణలో చేర్చేటప్పుడు మరింత జాగ్రత్త అవసరం. ఆమె జగన్ కుటుంబ సభ్యురాలు మాత్రమే కాదు, జగన్ రాజకీయ ప్రయాణం ప్రారంభదశలో ఆయనకు మద్దతుగా ప్రజల్లో తిరిగిన నాయకురాలు. జగన్ జైలులో ఉన్న సమయంలో పార్టీ కోసం పాదయాత్ర చేసిన వ్యక్తి. తర్వాత రాజకీయ విభేదాలు తీవ్రరూపం దాల్చి ఆమె స్వంత రాజకీయ మార్గాన్ని ఎంచుకున్నారు. కాంగ్రెస్‌లో చేరి జగన్‌పైనే ప్రత్యక్ష రాజకీయ పోరాటం చేశారు. ఇది కేవలం పార్టీ మార్పు కాదు. ఒకే రాజకీయ వారసత్వంపై రెండు భిన్నమైన రాజకీయ హక్కుల పోరాటం. వైఎస్ఆర్ వారసత్వాన్ని ఎవరు ముందుకు తీసుకెళ్లాలి? కుటుంబ రాజకీయ వారసత్వం అంటే ఏమిటి? వ్యక్తిగత పార్టీ అంటే కుటుంబంలోని మిగిలిన వారికి రాజకీయ స్థలం ఉండకూడదా? ఇలాంటి ప్రశ్నలన్నీ ఈ విభేదంలో కలిసిపోయాయి. అయితే షర్మిల చేసిన ప్రతి విమర్శను వాస్తవంగా, జగన్ చేసిన ప్రతి వాదనను అబద్ధంగా పరిగణించడం కూడా సరైన విశ్లేషణ కాదు. కానీ కుటుంబ స్థాయిలో కూడా రాజకీయ విభేదం బహిరంగ యుద్ధంగా మారడం జగన్ రాజకీయ వ్యవస్థలో సంబంధాల నిర్వహణపై ప్రశ్నలు మాత్రం రేపింది.



### అసలు సమస్య.. 'వాళ్లు ఎందుకు వెళ్లారు?' కాదు..

ఇప్పటివరకు జరిగిన పరిణామాలను చూస్తే అసలు ప్రశ్న 'వాళ్లు ఎందుకు వెళ్లారు?' అనే ఒక్కటే కాదు. 'వాళ్లు ఉన్నప్పుడు జగన్ వారిని ఎంతవరకు వినేవారు?' అనేదీ అంతే ముఖ్యమైనది. ఒక నాయకుడి చుట్టూ ఉన్న వాళ్లు కేవలం ఆదేశాలు అమలు చేసే యంత్రాలైతే.. అది పార్టీ కాదు. ఒక నాయకుడి చుట్టూ ఉన్నవాళ్లు తమ రాజకీయ భవిష్యత్తు కోసం నాయకుడి ప్రతి మాటకు తలూపే పరిస్థితిలో ఉంటే.. అది సంస్థాగత ప్రజాస్వామ్యం కాదు. నిజమైన నాయకత్వం అంటే తనతో విభేదించే వాళ్లను కూడా దగ్గరగా ఉంచుకోవడం. జగన్ రాజకీయ ప్రయాణంలో బలమైన వ్యక్తిగత నాయకత్వం ఉంది. అదే ఆయన బలం. అదే కొన్నిసార్లు బలహీనతగా మారే అవకాశం కూడా ఉంది. వ్యక్తిగత ప్రజాదరణ ఎక్కువగా ఉన్న నాయకుడికి పార్టీ వ్యవస్థ తన వ్యక్తిత్వానికి పొడిగింపుగా మారుతుంది. అప్పుడు నాయకుడిని విమర్శించడం అంటే పార్టీని విమర్శించడం కాదు.. నాయకుడినే సవాలు చేయడం అవుతుంది. ఇలాంటి వాతావరణంలో భిన్నాభిప్రాయం చెప్పే నాయకులు క్రమంగా వెనక్కి తగ్గుతారు. చివరకు నిజం చెప్పేవాళ్లు తగ్గి.. నచ్చిన మాట చెప్పేవాళ్లు పెరుగుతారు. అది ఏ నాయకుడికైనా ప్రమాదమే. విశ్వసనీయత అంటే విధేయత కాదు.. ఇక్కడ జగన్ తరచూ ఉపయోగించే 'విశ్వసనీయత' అనే పదానికి అసలు అర్థాన్ని వెతకాల్సి ఉంటుంది. విశ్వసనీయత అంటే నాయకుడి ప్రతి నిర్ణయానికీ మద్దతు ఇవ్వడం కాదు. నాయకుడు తప్పు చేస్తున్నప్పుడు కూడా 'మీరు చెప్పిందే కరెక్ట్' అనడం కాదు. అది విధేయత. కొన్నిసార్లు అది స్వార్థపూరిత విధేయత కూడా కావచ్చు. విశ్వసనీయత అంటే నాయకుడి ముందు నిజం చెప్పగల ధైర్యం. నాయకుడు వినడానికి ఇష్టపడని విషయాన్ని కూడా చెప్పగలగడం. నాయకుడు తప్పు చేస్తే ఆపగలగడం. నాయకుడు ప్రజలకు దూరమవుతున్నాడని హెచ్చరించగలగడం. పార్టీ ఓడిపోతున్నప్పుడు జేజేలు కొట్టకుండా వాస్తవ పరిస్థితిని చెప్పగలగడం. అలాంటి వ్యక్తిని నాయకుడు కోల్పోతే.. కోల్పోయింది ఒక నాయకుడిని కాదు. తనకు తాను అద్దం చూపించే మనిషిని.

### జగన్ ఎదుర్కొంటున్న అసలు రాజకీయ సవాలు

2024 ఎన్నికల్లో వైసీపీ ఎదుర్కొన్న భారీ పరాజయం తర్వాత జగన్ ముందున్న ప్రశ్న కేవలం పార్టీని తిరిగి అధికారంలోకి ఎలా తీసుకురావాలన్నది కాదు. పార్టీని తిరిగి ఒక సమిష్టి రాజకీయ సంస్థగా ఎలా నిర్మించాలన్నది. అధికారం ఉన్నప్పుడు పార్టీని నడపడం ఒక విధానం. అధికారం లేనప్పుడు పార్టీని నిలబెట్టడం మరో విధానం. అధికారంలో ఉన్నప్పుడు పదవులు పంచవచ్చు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నమ్మకం పంచాలి. అధికారంలో ఉన్నప్పుడు నేతలు అధినేత చుట్టూ చేరతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అధినేత నేతల దగ్గరకు వెళ్లాలి. ఇదే రాజకీయ వాస్తవం. జగన్ ఇప్పుడు చేయాల్సింది పాత నేతలపై కోపం చూపడం కాదు. వారు ఎందుకు వెళ్లారో ఒక్కొక్కరిని రాజకీయంగా విశ్లేషించడం. ఎవరు అవకాశవాది? ఎవరు అసంతృప్తితో వెళ్లారు? ఎవరి ఆరోపణల్లో వాస్తవం ఉంది? ఎవరి వెనుక వ్యక్తిగత ప్రయోజనం ఉంది? ఎవరు తిరిగి రావడానికి అవకాశం ఉంది? ఎవరి మాటల్లో పార్టీకి ఉపయోగపడే హెచ్చరిక ఉంది? ఇవన్నీ వేరు చేయాలి. ఎందుకంటే ప్రతి విమర్శ శత్రుత్వం కాదు. కొన్నిసార్లు విమర్శ హెచ్చరిక. ప్రతి అసమ్మతి ద్రోహం కాదు. కొన్నిసార్లు అసమ్మతి సంస్థను కాపాడే చివరి ప్రయత్నం. ప్రతి పార్టీ మార్పు అవకాశవాదం కాదు. కొన్నిసార్లు అది నాయకత్వంపై వ్యక్తి వ్యక్తం చేసే నిరసన. అలాగే ప్రతి పార్టీ మారినవాడు నిజాయితీపరుడే కాదు. కొన్నిసార్లు అది కేవలం రాజకీయ లెక్క. ఈ తేడాలను గుర్తించగలిగిన నాయకత్వమే దీర్ఘకాలం నిలబడుతుంది. చివరికి మిగిలేది ఒక్క ప్రశ్న.. జగన్ తన రాజకీయ జీవితంలో ఎన్నో పోరాటాలు చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఎదిరించారు. సొంత పార్టీ పెట్టుకున్నారు. జైలు జీవితం చూశారు. పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్లారు. 2019లో అపూర్వమైన మెజారిటీతో అధికారంలోకి వచ్చారు. 2024లో ఘోర పరాజయాన్ని ఎదుర్కొన్నారు. ఇంతటి ఎత్తుపల్లాలను చూసిన నాయకుడు తిరిగి అధికారంలోకి వస్తే.. ఏంటని కూటమి నేతలు టెన్షన్ ఫీలవుతున్న పరిస్థితి.. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు అవసరమైనది మరో భారీ నినాదం కాదు. ఒక అంతర్మథనం. నన్ను వీడిన వాళ్లందరూ తప్పు చేశారా? లేక వాళ్లలో కొందరు నా నాయకత్వానికి అద్దం పట్టారా? నా చుట్టూ ఉన్నవాళ్లు నాకు నిజం చెబుతున్నారా? లేక నేను వినాలనుకునే మాటలనే చెబుతున్నారా? పదవి ఉన్నప్పుడు నాతో ఉన్నవాళ్లే నిజమైన విశ్వసనీయులా? లేక పదవి లేకపోయినా నా పక్కన నిలిచేవాళ్లేనా? నేను కార్యకర్త నుంచి విశ్వాసం కోరుతున్నప్పుడు.. నేను కూడా కార్యకర్తకు, నేతకు, సహచరుడికి అదే స్థాయి విశ్వాసం ఇస్తున్నానా?

# శ్రేయస్‌కు బ్యాకప్ ఎవరు?

## మిడిలార్డర్‌పై కొత్త వ్యూహం • తిలక్‌పై కోచ్ గంభీర్ ఫోకస్






2027 వన్డే ప్రపంచకప్ కోసం టీమిండియా ఇప్పటి నుంచే కూర్పుపై దృష్టి పెట్టింది. ప్రధానంగా మిడిలార్డర్‌కు సరైన బ్యాకప్ ఎవరన్నదే సెలెక్టర్లకు సవాల్‌గా మారింది. హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి గాయాలతో ఇబ్బంది పడుతుండటంతో బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ చేయగల ఆటగాడి అవసరం పెరిగింది. ఈ నేపథ్యంలో శ్రేయస్ అయ్యర్‌కు ప్రత్యామ్నాయంగా తిలక్ వర్మ పేరు ముందుకు వచ్చినట్టు టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం పేర్కొంది. ఒత్తిడిలో బ్యాటింగ్ చేయగల సామర్థ్యం తిలక్‌కు అదనపు బలంగా మారింది. ముఖ్యంగా అవసరమైనప్పుడు బంతితోనూ సహకరించగలగడం సెలెక్టర్లను ఆకట్టుకుంటున్న అంశంగా తెలుస్తోంది. నాలుగు ఓవర్లు వేసే సామర్థ్యం ఉన్న బ్యాటర్ జట్టులో ఉంటే ప్రధాన బౌలర్లపై భారం తగ్గుతుంది. దక్షిణాఫ్రికా పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రపంచకప్ జట్టు కూర్పును సిద్ధం చేయాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్టు సమాచారం.

### సీనియర్ల వయసు.. యువ బ్యాకప్‌లపై దృష్టి

ప్రపంచకప్ సమయానికి పలువురు సీనియర్ ఆటగాళ్ల వయసు కూడా టీమిండియా ప్రణాళికల్లో కీలక అంశంగా మారుతోంది. శ్రేయస్ అయ్యర్ ఇటీవల గాయాలతో ఇబ్బంది పడ్డాడు. పేస్, బౌన్స్‌ను ఎదుర్కొనే అతడి ప్రస్తుత సామర్థ్యంపై కూడా టీమ్ మేనేజ్‌మెంట్ పరిశీలన కొనసాగుతోంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి సీనియర్లకు ఫిట్‌నెస్ సమస్యలు, కేఎల్ రాహుల్‌కు 35 ఏళ్లకు పైబడే వయసు, రవీంద్ర జడేజా స్థానంపై అనిశ్చితి నేపథ్యంలో యువ ఆటగాళ్లను సిద్ధంగా ఉంచాలని భావిస్తున్నట్టు సమాచారం. అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో జరగనున్న ఐదు వన్డేల సిరీస్‌లో ప్రపంచకప్ ప్రణాళిక మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. అంతకుముందు సెప్టెంబర్ 27 నుంచి వెస్టిండీస్‌తో మూడు వన్డేలు జరగనున్నాయి. అయితే ఆసియా క్రీడల్లో టి20 జట్టు పాల్గొననున్న నేపథ్యంలో కొందరు సీనియర్లు ఈ సిరీస్‌కు దూరంగా ఉండే అవకాశం ఉంది. ప్రపంచకప్ వరకు బలమైన బెంచ్ సిద్ధం చేయడమే గంభీర్, గిల్, అగార్కర్ బృందం ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

# ఇంగ్లండ్ దెబ్బ..పాకిస్థాన్ అబ్బ

## సంచలన మార్పులకు పీసీబీ సిద్ధం

ఇంగ్లండ్ చేతిలో వరుసగా రెండు ఘోర పరాజయాలతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అప్రమత్తమైంది. మూడు టెస్టుల సిరీస్‌లో ఇప్పటికే 20తో ఇంగ్లండ్ ఆధిక్యం సాధించడంతో చివరి టెస్టుకు ముందు జట్టులో భారీ మార్పులకు రంగం సిద్ధమైంది. హెడ్డింగ్లీలో ఇంగ్లండ్ ఇన్నింగ్స్ 103 పరుగుల తేడాతో గెలిచింది. లార్డ్స్‌లో 194 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ముఖ్యంగా పాకిస్థాన్ బ్యాటింగ్ తీవ్రంగా విఫలమైంది. లార్డ్స్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో 110 పరుగులకు, రెండో ఇన్నింగ్స్‌లో 194 పరుగులకే ఆలౌట్ కావడం జట్టు పరిస్థితిని స్పష్టంగా చూపించింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ నుంచి ఆరుగురు ఆటగాళ్లను ఇంగ్లండ్‌కు పిలిపించేందుకు పీసీబీ సిద్ధమైంది. సయీమ్ అయూబ్, అరాఫత్ మిన్హాస్ పేర్లు ఇప్పటికే వినిపిస్తున్నాయి. మిగిలిన ఆటగాళ్లు వీసా ప్రక్రియ పూర్తయ్యాక జట్టుతో చేరే అవకాశం ఉంది. మరోవైపు మహ్మద్ రిజ్వాన్ పేలవ ఫామ్ కారణంగా స్వదేశానికి పంపే అవకాశం ఉంది. ఇమామ్ ఉల్ హక్ కూడా కాలి కండరాల గాయం కారణంగా తిరిగి వెళ్లే అవకాశం కనిపిస్తోంది.

### కోచింగ్ బాధ్యతల్లోనూ కీలక మార్పు

చివరి టెస్టుకు ముందు కోచింగ్ వ్యవస్థలోనూ పీసీబీ కీలక మార్పుకు సిద్ధమైంది. ప్రస్తుతం పాకిస్థాన్ వైట్ బాల్ హెడ్ కోచ్‌గా ఉన్న మైక్ హేసన్ ఎడ్జ్‌బాస్టన్ టెస్టుకు రెడ్‌బాల్ జట్టును పర్యవేక్షించే అవకాశం ఉంది. సర్ఫరాజ్ అహ్మద్ భవిష్యత్‌పై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఈ మార్పును PCB అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. ఇదే సమయంలో హేసన్, హై పెర్ఫార్మెన్స్ డైరెక్టర్ ఆఖిబ్ జావెద్ ఇప్పటికే లండన్ చేరుకున్నారు. సెప్టెంబర్ 2న కింగ్ చార్లెస్ నిర్వహించనున్న విందులో పాకిస్థాన్ జట్టుతో పాల్గొనేందుకే వారు వెళ్లినట్టు పీసీబీ వివరణ ఇచ్చింది. పీసీబీ చైర్మన్ మొహ్సిన్ నఖ్వీ, సీఓఓ సుమైర్ అహ్మద్, పీఎస్ఎల్ చీఫ్ సల్మాన్ నసీర్ కూడా లండన్‌లో ఉండనున్నారు. సెప్టెంబర్ 1న పీఎస్ఎల్ సమావేశం కూడా ఉంది. అయితే మైదానంలో జట్టు ఘోరంగా విఫలమవుతున్న సమయంలో పీసీబీ అధికారులు లండన్‌లో ఉండటం పాకిస్థాన్ క్రికెట్‌లో చర్చకు దారితీసింది. సెప్టెంబర్ 9న ఎడ్జ్‌బాస్టన్‌లో మూడో టెస్టు ప్రారంభం కానుండటంతో, ఈ కొద్దిరోజుల్లోనే జట్టును పునర్నిర్మించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# వైభవ్ సంచలనం




- 42 బంతుల్లో అర్ధ శతకం
- చిన్న వయసులోనే చరిత్ర
- 15 ఏళ్లకే 57 ఏళ్ల రికార్డు బద్దలు

వైభవ్ సూర్యవంశీ మరోసారి తన బ్యాట్‌తో సంచలనం సృష్టించాడు. కేవలం 15 ఏళ్ల 157 రోజుల వయసులోనే దులీప్ ట్రోఫీ చరిత్రలో అత్యంత చిన్న వయసులో అర్ధ శతకం చేసిన ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. ఈస్ట్ జోన్ తరఫున సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్‌లో సోమవారం వైభవ్ తన ట్రేడ్‌మార్క్ దూకుడైన బ్యాటింగ్‌తో విరుచుకుపడ్డాడు. కేవలం 42 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేశాడు. ఇందులో మూడు సిక్సర్లు, ఐదు ఫోర్లు ఉన్నాయి. సెంచరీకి కూడా చేరువగా వెళ్లిన వైభవ్ 92 పరుగుల వద్ద ఔటై, మరో చరిత్రాత్మక మైలురాయిని తృటిలో చేజార్చుకున్నాడు.

### 57 ఏళ్ల పాత రికార్డుకు తెర

వైభవ్ సూర్యవంశీ సాధించిన ఈ అర్ధ శతకంతో 57 ఏళ్లుగా చెక్కుచెదరకుండా ఉన్న రికార్డు బద్దలైంది. 1969లో లక్ష్మణ్ సింగ్ 16 ఏళ్ల 23 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో తొలి అర్ధ శతకం సాధించాడు. ఇప్పుడు వైభవ్ 15 ఏళ్ల 157 రోజులకే ఆ రికార్డును తన పేరుతో రాసుకున్నాడు. ఈ జాబితాలో పియూష్ చావ్లా మూడో స్థానంలో ఉన్నాడు. 2025లో అతను 16 ఏళ్ల 307 రోజుల వయసులో దులీప్ ట్రోఫీలో అర్ధ శతకం సాధించాడు. యువ ఆటగాడిగా వైభవ్ దూకుడైన బ్యాటింగ్ శైలి మరోసారి ప్రత్యేకంగా నిలిచింది.

### కెప్టెన్సీ బాధ్యత కూడా వైభవ్‌పైనే

ఈ మ్యాచ్‌లో వైభవ్‌కు మరో కీలక బాధ్యత కూడా వచ్చింది. ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ చేతికి గాయం కావడంతో కొంతసేపు మైదానం నుంచి బయటకు వెళ్లాడు. సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్ సమయంలో లంచ్‌కు ముందు, తర్వాత దాదాపు గంట పాటు వైభవ్ ఈస్ట్ జోన్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అనంతరం ఇషాన్ తిరిగి మైదానంలోకి వచ్చి జట్టు బాధ్యతలు చేపట్టాడు. అంతకుముందు ఈస్ట్ జోన్ బౌలర్లు సెంట్రల్ జోన్‌ను 266 పరుగులకే ఆలౌట్ చేశారు. ముకేశ్ కుమార్ 3 వికెట్లు, అభిజిత్ సర్కార్ 3 వికెట్లు, మహ్మద్ షమీ 2 వికెట్లు, కునైన్ ఖురేషీ 2 వికెట్లు పడగొట్టారు. బ్యాటింగ్‌లో రికార్డు.. కెప్టెన్సీలో బాధ్యత.. 15 ఏళ్ల వైభవ్ ప్రదర్శన మరోసారి క్రికెట్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.



# విడుదలకు రెడీ అవుతున్న సర్దార్-2

కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాల్లో 'సర్దార్ 2' ఒకటి. పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా.. గతంలో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'సర్దార' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోంది. మొదటి భాగంలో ఏజెంట్‌గా కార్తీ చేసిన యాక్షన్, డిఫరెంట్ గెటప్‌లు ప్రేక్షకులను మెప్పించడంతో.. సీక్వెల్‌పై కూడా మంచి అంచనాలు నెలకొన్నాయి. తాజాగా 'సర్దార్ 2'కు సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా తెలుగు వెర్షన్‌కు సంబంధించిన ట్రైలర్, ఆడియోను విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. దీంతో కార్తీ అభిమానుల్లో సందడి మొదలైంది. 'సర్దార్ 2'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి ఉంది. ఇప్పుడు తెలుగు ట్రైలర్ విడుదల కానుండటంతో సినిమాకు సంబంధించిన కథ, కార్తీ పాత్ర, యాక్షన్ సన్నివేశాలు, విలన్ క్యారెక్టర్‌పై మరింత క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మొదటి భాగంలో కార్తీ ఏజెంట్ పాత్రకు మంచి స్పందన రావడంతో.. రెండో భాగంలో ఆ పాత్రను దర్శకుడు ఏ స్థాయిలో చూపించారనే విషయంపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై బజ్ మరింత పెరుగుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'సర్దార'లో కార్తీ విభిన్న గెటప్‌లలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా ఏజెంట్ పాత్ర సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడు అదే పాత్రను కొనసాగిస్తూ 'సర్దార్ 2'తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సీక్వెల్‌లో కథ మరింత విస్తృతంగా ఉండబోతుందని, యాక్షన్‌తో పాటు స్పై థ్రిల్లర్ అంశాలకు ప్రాధాన్యత ఉంటుందని తెలుస్తోంది. మొదటి భాగంతో పోలిస్తే రెండో భాగాన్ని మరింత భారీ స్థాయిలో తెరకెక్కించినట్లు చిత్ర బృందం చెబుతోంది. సర్దార్ 2'లో మాళవిక మోహనన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కార్తీతో ఆమె కాంబినేషన్ సినిమాకు మరో ఆకర్షణగా నిలవనుంది. యాక్షన్, థ్రిల్లర్ అంశాలతో పాటు సినిమాలో ఎమోషనల్, కమర్షియల్ ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు తెలుస్తోంది. 'సర్దార్ 2' చిత్రాన్ని 2026 సెప్టెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.





# 200 కోట్ల వైపు ఇరుముడి దూకుడు

ఇరుముడి కట్టు వీడగియో సాంగ్ విడుదల చేసిన మేకర్స్ మాస్ మహారాజా రవితేజకు మరో బ్లాక్‌బస్టర్ హిట్ దక్కింది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఇరుముడి' సినిమా బాక్సాఫీస్ వద్ద అంచనాలకు మించి దూసుకెళ్తోంది. విడుదలైనప్పటి నుంచి ప్రేక్షకుల నుంచి వస్తున్న అద్భుతమైన స్పందనతో ఈ సినిమా వరల్డ్‌వైడ్‌గా ఇప్పటికే రూ.150 కోట్ల గ్రాస్ మార్క్‌ను దాటింది. ప్రస్తుతం అదే జోరును కొనసాగిస్తూ మరో భారీ మైలురాయిని అందుకునే దిశగా పరుగులు పెడుతోంది. 'ఇరుముడి' సినిమాకు ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌కు తాజా టికెట్ సేల్సే నిదర్శనంగా చెప్పొచ్చు. ప్రముఖ ఆన్‌లైన్ టికెటింగ్ ప్లాట్‌ఫామ్స్ బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ ద్వారా ఇప్పటివరకు ఈ సినిమా 70 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. ఒక ప్రాంతీయ సినిమా ఈ స్థాయిలో టికెట్లను విక్రయించడం అరుదైన విషయంగా ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. 'ఇరుముడి' ఇప్పుడు రూ.200 కోట్ల వరల్డ్‌వైడ్ గ్రాస్ దిశగా అడుగులు వేస్తోంది. ఇకపోతే రవితేజ మాస్ ఇమేజ్‌కు తగ్గ కమర్షియల్ అంశాలతో పాటు కథకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వడం 'ఇరుముడి' విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా చెబుతున్నారు. దర్శకుడు శివ నిర్వాణ తనదైన శైలిలో కథను తెరకెక్కించడంతో ప్రేక్షకులు సినిమాతో కనెక్ట్ అవుతున్నారని చిత్ర బృందం భావిస్తోంది. రవితేజ తన పాత్రలో మాస్ ఎనర్జీతో పాటు భావోద్వేగాలను కూడా బలంగా పండించారని అభిమానులు ప్రశంసిస్తున్నారు. సినిమాలోని కీలక సన్నివేశాలు ప్రేక్షకులను కదిలి స్తున్నాయని, ముఖ్యంగా క్లైమాక్స్ ఎమోషనల్ సీన్స్‌కు థియేటర్లలో మంచి స్పందన వస్తుంది. అయ్యప్ప స్వామి భక్తి, తండ్రీకూతుళ్ల మధ్య ఉండే ఆత్మీయ అనుబంధాన్ని ప్రధానంగా తీసుకుని ఈ సినిమాను రూపొందించారు. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా నుంచి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న కీలకమైన 'ఇరుముడి కట్టు' వీడియో సాంగ్‌ని మేకర్స్ ఘనంగా విడుదల చేశారు. 'కట్టు కట్టు ఇరుముడి కట్టు' అంటూ సాగే ఈ గీతం విడుదలైన వెంటనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సంగీత దర్శకుడు జి.వి. ప్రకాష్ కుమార్ ఈ పాటకు అందించిన ట్యూన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హై 'వోల్టేజ్ భక్తి సంగీతం, అయ్యప్ప మాలధారుల నృత్యాలు, 'స్వామియే శరణమయ్యప్ప' అనే నామస్మరణతో సాగుతున్న ఈ గీతం శ్రోతలను ఆకట్టుకుంటోంది. పాటను వింటున్న సమయంలోనే భక్తిభావం కలిగేలా మ్యూజిక్‌ను కంపోజ్ చేసిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. ముఖ్యంగా మాలధారుల డ్యాన్స్ మూమెంట్స్, ఎనర్జిటిక్ బీట్స్ పాటకు మరింత జోష్‌ను తీసుకొచ్చాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన వీడియోలు, రీల్స్ వైరల్ అవుతున్నాయి. 'ఇరుముడి'లో ఈ పాటతో పాటు 'విల్లాలి వీరుడు', 'మల్లెపూల పల్లకి' వంటి భక్తి గీతాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





## కిరణ్ అబ్బవరం మూవీకి

# హతః టైటిల్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు.'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. ఈజ్ ద క్యాట్ అలైవ్ ఆర్... అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది. కిరణ్ అబ్బవరం, పౌర్ణమి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సినిమాకు అనుష్ గోరాక్ రచన, దర్శకత్వంతో పాటు సినిమాటోగ్రఫీ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ చిత్రంలో కుష్బు మద్దాల, రెహ్మాన్, నమిత ఎంవీ, తనూజ పుట్టస్వామి తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జెసిన్ జార్జ్ సంగీతం అందిస్తుండగా, అఖిల్ చక్రవర్తి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం 'హతః' చిత్రానికి సంబంధించిన షూటింగ్, కథ, పాత్రలు, విడుదల తేదీ వంటి వివరాలను మేకర్స్ సస్పెన్స్‌లోనే ఉంచారు. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

This newspaper is Owned and Published by **GUNDEBOINA VENKANNA** from 2-7-76, GURUKRUPA COMPLEX, UPPAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500047. Phone Number: 9440906108.
Editor: **GUNDEBOINA VENKANNA** and Printed at 1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500010.
PRGI REGD No.: **TGBIL/26/A6717**. www.rajyasamskarana.com.